# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 85 | విశాఖపట్నం | 25-12-2025 గురువారం | చీఫ్ ఎడిటర్ : శ్రీనివాస్ లెక్కల | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 85 | VISAKHAPATNAM | 25-12-2025 THURSDAY | CHIEF EDITOR: SRINIVAS LEKKALA | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



రిపోర్టర్లు కావలెను

పతాకం న్యూస్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు శ్రీకాకుళం, పాడేరు, గోదావరి జిల్లాలు తో పాటు ఆంధ్రప్రదేశ్‌లో గల రాయలసీమ, జిల్లాలో జిల్లా రిపోర్టర్స్ కావలెను.

అనుభవం ఉన్న వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వబడును.

ప్రతి వార్త ఉన్నది ఉన్నట్టుగా రాసి చూపిద్దాం రండి...

ఆఫీస్ ఇంఛార్జ్ : ఎల్.కృష్ణ రావు

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

9516171797, 9491286902


## రుషికొండ ప్యాలెస్ నిర్మాణాలను ఎలా ఉపయోగంలోకి

# తేవాలని మంత్రుల చర్చ



**అమరావతి, పతాకం న్యూస్:** రుషికొండపై నిర్మించిన ప్యాలెస్‌ను ఎలా ఉపయోగంలోకి తేవాలన్న అంశంపై మంత్రివర్గ ఉపసంఘం మరోసారి తీవ్రంగా చర్చించింది. విశాఖలోని రుషికొండపై గత ప్రభుత్వం నిర్మించిన రాజభవనాలను వినియోగంలోకి తెచ్చే అంశంపై కూటమి ప్రభుత్వం తీవ్రంగా కసరత్తు చేస్తోంది. ఈ అంశంపై ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీ ఆ ప్యాలెస్‌లను వీలైనంత త్వరగా వినియోగంలోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఆ క్రమంలో కొన్ని సవాళ్లు ఎదురవుతున్నాయని వాటిని అధిగమించేందుకు పలు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. సచివాలయంలో రెండోబ్లాక్‌లో మంత్రివర్గ ఉపసంఘం మూడో సారి సమావేశమైంది. ఇందులో మంత్రులు పయ్యావుల కేశవ్, కందుల దుర్గేష్, పాల్గొనగా, మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి వర్చువల్? విధానంలో పాల్గొన్నారు. పర్యాటక శాఖ స్పెషల్? చీఫ్? సెక్రటరీ అజయ్? జైన్?, టూరిజం ఎండీ ఆమ్రపాలి, పర్యాటక శాఖ అధికారులు పాల్గొన్నారు. రుషికొండ ప్యాలెస్?ను ఆతిథ్య కేంద్రాలుగా మార్చేందుకు టాటా గ్రూప్? సహా పలు ప్రముఖ సంస్థలు ముందుకు రాగా ఎవరికి అప్పగించాలనే అంశంపై చర్చించారు. ఆతిథ్య కేంద్రాలు, రెస్టారెంట్లు, కన్వెన్షన్ సెంటర్లు, ఫంక్షన్ హాళు ్లగా వినియోగానికి సంస్థలు డీపీఆర్ ఇవ్వగా వాటిపై సమగ్ర విశ్లేషణలు జరిపారు. ప్రసుతం ఉన్న ప్యాలెస్?లు రాజభవనాలు కావడంతో పర్యాటకుల కోసం ప్రత్యేకంగా 60 వేల చదరపు అడుగుల్లో అదనంగా గదులు నిర్మిస్తే తీసుకునేందుకు సిద్ధమని పలు సంస్థలు సంసిద్దత వ్యక్తం చేయగా వాటి నిర్మాణాలపై ప్రత్యేకంగా చర్చించారు. రుషికొండ భవనాల కింద ఉన్న ప్రాంతంలో 9 ఎకరాల్లోని 7 ఎకరాల్లో భవనాల నిర్మాణాలు సాధ్య పడదని అధికారులు తాజాగా తెల్చారు. 7 ఎకరాలు సీఆర్‌జెడ్ పరిధిలోకి వస్తాయని, (తరువాయి 2వ పేజీలో)



## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న పవన్ స్వయంగా వృద్ధురాలి ఇంటికి వెళ్లి ఆర్థికసాయం

2లో

## టీటీడీలో జరిగిన అక్రమాలను

# వెలికితీస్తున్నాం

## రాష్ట్ర కార్మిక, పరిశ్రమల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి




**అమరావతి, పతాకం న్యూస్:** గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో పవిత్ర తిరుమల క్షేత్రంలో అనేక అక్రమాలు, మహాపాపాలు జరిగాయని రాష్ట్ర కార్మిక, పరిశ్రమల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. భక్తులు ఎంతో పవిత్రంగా భావించే లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడిన ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిందని, గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవకతవకలు ఇప్పుడు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయని అన్నారు. బుధవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో కలియుగ దైవం శ్రీవెంకటేశ్వర స్వామి దర్శనానికి దేశ, విదేశాల నుంచి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, వారి సౌకర్యాల విషయంలో వైసీపీ ప్రభుత్వం ఘోరంగా నిర్లక్ష్యం వహించిందని జనార్ధన్ రెడ్డి విమర్శించారు. అప్పటి టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి పాత్రపై కూడా ఇప్పుడు ప్రజలకు స్పష్టత వస్తోందని, అయితే ఆ వ్యవహారాలు న్యాయస్థానాల పరిధిలో ఉన్నందున ఎక్కువగా మాట్లాడటం లేదని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరుమలలో ప్రక్షాళన మొదలుపెట్టామని, ప్రసాదాలకు వాడే నెయ్యితో సహా అన్ని పదార్థాలను కఠినంగా పరీక్షించాకే వినియోగిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా ఏకాదశి రోజున 'వైకుంఠం దర్శనం' ద్వారా 90 శాతానికి పైగా సామాన్య భక్తులకు దర్శన భాగ్యం కల్పించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని మంత్రి పేర్కొన్నారు. అసలు దేవుడిపై నమ్మకం లేని వ్యక్తికి టీటీడీ లాంటి పవిత్ర సంస్థ బాధ్యతలు అప్పగించడమే గత ప్రభుత్వపు పెద్ద తప్పిదమని ప్రజలు భావిస్తున్నారన్నారు. గత ఆరు నెలలుగా కూటమి ప్రభుత్వ పనితీరుకు ప్రజల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోందని జనార్ధన్ రెడ్డి చెప్పారు. డీఎస్సీ, పోలీస్ కానిస్టేబుల్ నియామకాలు చేపట్టామని, సీఐఐ సదస్సుల ద్వారా రాష్ట్రానికి వేల కోట్ల పెట్టుబడులు ఆకర్షిస్తున్నామని తెలిపారు.



5లో

## కార్పొరేట్ కానుకలన్నీ బీజేపీకే!



6లో

## నడుంనొప్పికి కారణం ఏమిటి?

## ఎటుచూసినా వాహనాలు, భారీ యంత్రాలు..

# శరవేగంగా అమరావతి నిర్మాణ పనులు

**అమరావతి, పతాకం న్యూస్:** అమరావతిలో నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. రాజధానిలో ఏ వైపు చూసినా వేల మంది కార్మికులు, వాహనాలు, యంత్రాలు, భారీ నిర్మాణ సామగ్రి దర్శనమిస్తున్నాయి. రాజధాని సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టు ఐకానిక్ టవర్స్, ట్రంక్ రోడ్లు, మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, జడ్జిలు, ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, అఖిల భారత సర్వీసు అధికారుల భవన సముదాయాల పనులు వేగంగా జరుగుతున్నాయి. దానితోపాటు మరో వైపున రాజధాని నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతుల రిటర్నబుల్ ప్లాట్ల అభివృద్ధికీ శరవేగంగా ఎల్‌పీఎస్ లేఔట్ నిర్మాణ పనులు చేస్తున్నారు. ప్రస్తుతమున్న లేఔట్‌లలో జంగిల్ క్లియరెన్స్ పనులతో పాటు రోడ్లు, సరిహద్దు రాళ్ల ఏర్పాటు చేసే పనులను చేస్తున్నారు. ఏపీ ఎన్‌ఆర్‌టీ, హ్యాపీనెస్ట్ ప్రాజెక్టు పనులు చురుగ్గా సాగుతున్నాయి. అమరావతిలో నిర్మిస్తున్న హ్యాపీ నెస్ట్ పనులు వేగంగా జరుగుతున్నాయి. పైల్ ఫౌండేషన్ పనులు పూర్తి కావడంతో బేస్‌మెంట్ ఏర్పాటు చేయటం కోసం ప్రస్తుతం కార్మికులు ర్యాఫ్ట్ ఫౌండేషన్ పనులు చేస్తున్నారు. ఈ ప్రాజెక్టును మొత్తం 12 టవర్స్‌తో 2 బేస్‌మెంట్‌లు, గ్రౌండ్ ఫ్లోర్ం 18 ఫ్లోర్‌లుగా నిర్మాణం చేస్తున్నారు. ప్రతి ఫ్లోర్‌కు 4 లేదా 6 ప్లాట్లను నిర్మాణం చేయనున్నారు. మొత్తం 1200 ప్లాట్లు నిర్మించనున్నారు. మొత్తం 29.23 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో హ్యాపీనెస్ట్ ప్రాజెక్టును నిర్మించనున్నారు. రాజధాని అమరావతిలో నిర్మాణ పనులు తిరిగి ప్రారంభించేందుకు సర్కార్ సమాయత్తమైంది. ముందుగా నిర్మాణంలో ఉన్న భవనాలు పూర్తి చేసేందుకు టెండర్ల ప్రక్రియ చేపట్టింది. అదే విధంగా ఆ ప్రాంతంలో రహదారులను అభివృద్ధి చేసేందుకు చర్యలను తీసుకుంది. ప్రస్తుతం అమరావతిలో విద్యాసంస్థలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయలకు వెళ్లే రోడ్లను మొదటి విడతలోనే నిర్మించనున్నారు. రాజధాని గ్రామాల్లో సీఆర్డీఏ కాంపిటెంట్ అథారిటీ కార్యాలయాలు ఏర్పాటవ్వడంతో



రైతులు విజయవాడ సీఆర్డీఏ కార్యాలయానికి వెళ్లాల్సిన అవసరం తప్పింది. ఈ పరిణామాలన్నింటిపై అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజధాని నిర్మాణాన్ని నిలిపివేయటమే కాకుండా అక్కడి ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనను సైతం పక్కన పెట్టారు. గ్రామాల్లో సరైన రహదారులు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నా అసలు పట్టించుకోలేదు. అమరావతిపై కక్షతో అక్కడి ప్రజలను వైఎస్సార్సీపీ సర్కార్ విస్మరించింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాజధాని గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. (తరువాయి 2వ పేజీలో)


పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా..

అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా..

పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS

State Bank of India

A/c No: 44576280686

IFSC:SBIN00021297

DUVVADA BRANCH

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## అభివృద్ధి అంటే అంటే జీడీపీ వృద్ధి రేటేనా?

గత వారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర వృద్ధి రేటు కేంద్రంగా అమరావతిలో కలెక్టర్ల సదస్సును నిర్వహించారు. జిల్లాల జిడిపి ర్యాంకులను కూడా విడుదల చేశారు. అంతకు ముందు రెండో త్రైమాసికం (జులై-సెప్టెంబర్) రాష్ట్ర స్థూల ఉత్పత్తి వృద్ధి (జిఎస్ డిపి) రేటు వివరాలు విడుదల చేస్తూ ఈ త్రైమాసికంలో 11.5 శాతం, తొలి ఈ ఆరు నెలల్లో 10.9 శాతం వృద్ధి రేటు నమోదయ్యిందని%.ఇది జాతీయ స్థాయిలో వృద్ధి రేటు 8.7 శాతం కన్నా ఎక్కువ అని చెప్పారు. ఈ ఏడాది లక్ష్యం 17.11 శాతం వృద్ధి రేటు సాధిస్తామని, ఇందుకోసం రంగాలవారీ ప్రత్యేక వ్యూహంతో ముందుకెళు తున్నామని ప్రకటించారు. రాష్ట్ర విభజన తర్వాత ఐదేళ్ల (2014-19) తెలుగుదేశం ప్రభుత్వ పాలనలో సగటున 13.5 శాతంతో పోలిస్తే వైసిపి పాలనలో సగటున 10.32 శాతంతో జిఎస్ డిపి వృద్ధి రేటు 3.2 శాతం తగ్గి రాష్ట్రం సుమారు రూ.7 లక్షల కోట్లు స్థూల ఉత్పత్తి కోల్పోయిందని, దీనివల్ల రాష్ట్ర రెవిన్యూ వసూళ్లు రూ.76195 కోట్లు నష్టపోయామని తెలిపారు. ఈ 18 నెలల కష్టంతో ఆర్థిక వ్యవస్థకు ఊపిరి పోశామని, ఇప్పుడు జిఎస్ డిపి వృద్ధి రేటును పెంచడానికి పెద్దఎత్తున ప్రైవేట్ పెట్టుబడులను ఆహ్వానిస్తున్నామని చెప్పారు. జిఎస్ డిపి పెరిగితే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడి, ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుందని, ఉపాధి పెరుగుతుందని ఫలితంగా రాష్ట్రం దేశంలోనే అత్యంత అభివృద్ధి చెందిన రాష్ట్రంగా మారుతుందని ఉపదేశించారు. కేంద్ర ప్రభుత్వ వికసిత భారత్ 2047లో భాగంగా అప్పటికి ఆంధ్ర రాష్ట్రం 2.4 బిలియన్ డాలర్ల (సుమారు రూ.200 లక్షల కోట్లు) ఆర్థిక వ్యవస్థకు చేరుకోవాలని, దీని సాధనకు ప్రతి ఏడాది సగటున 15 శాతం వృద్ధి రేటు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇది జరగాలంటే విదేశీ, స్వదేశీ పెట్టుబడులు పెద్ద ఎత్తున ఆహ్వానించాలని, ఇందుకు భూములు, పెట్టుబడి, పన్నుల రాయితీలు, ఇతర ఇన్‌పుట్స్ సబ్సిడీలు వంటివి భారీగా ఇవ్వాలని అలాగే ప్రస్తుత కార్మిక, భూ తదితర చట్టాలు పెట్టుబడులకు అనుగుణంగా మార్పులు చేయాలని నిర్ణయించారు. చంద్రబాబు చెబుతున్న జిడిపి వృద్ధి రేటు సిద్ధాంతం కొత్తదేమీ కాదు. ఇది నయా ఉదారవాద విధానాల నుండి ఉద్భవించిన పెట్టుబడిదారీ వ్యూహం. దేశంలో, రాష్ట్రంలో గత మూడు దశాబ్దాల నుండి పాలకులు స్థూల ఉత్పత్తి ఎక్కువ సాధించడం వల్ల ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, పేదరికం, నిరుద్యోగం, ఆర్థిక అసమానతలు తగ్గిపోతాయని ప్రచారం చేస్తున్నారు. కానీ జిడిపి పెంపు చుట్టూ చేస్తున్న వాదనలన్నీ పసలేనివని ఆచరణలో తేలిపోయింది. వాస్తవంగా జిడిపి వృద్ధి రేటు వల్ల ఉపాధి వృద్ధి రేటులో వచ్చే పెరుగుదల అనేది జిడిపి యొక్క పక్రియ, దాని స్వభావం, ఏయే రంగాల నుండి ఈ పెరుగుదల వచ్చింది, దీనివల్ల ఏయే తరగతులకు మేలు జరిగింది అనే దానిపై ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు వ్యవసాయం-చిన్న ఉత్పత్తి వంటి రంగాల ద్వారా వృద్ధి పెరిగితే దాని ద్వారా కలిగే ఉపాధి ప్రభావం తీవ్రత చాలా ఎక్కువగా ఉంటుంది. కానీ గత మూడు దశాబ్దాల నయా ఉదారవాద విధానాల అనుభవం ఏమిటంటే ఈ కాలంలో ఇవి తీవ్ర సంక్షోభంలో పడ్డాయి. ఆంధ్ర రాష్ట్రంలో చూస్తే రాష్ట్ర విభజన అనంతరం రాష్ట్ర జిడిపి లో వ్యవసాయ రంగం వాటా 2014-15లో 30.39 శాతం నుండి 2024-25 కి 35.20 శాతానికి పెరిగింది. ఇదే కాలంలో సాంప్రదాయ పంటలు ముఖ్యంగా ఆహార పంటల (ఉద్యాన పంటలు మినహా) వాటా 8.31 శాతం నుండి 3.89 శాతానికి పడిపోయింది. అలాగే రొయ్యలు, చేపలు, పౌల్ట్రీ, మాంసం వంటి వాటి వాటా 13. 50 శాతం నుండి 20.26 శాతానికి పెరిగింది. అత్యధిక మంది ఆధారపడ్డ ఆహార పంటల నుండి వస్తున్న ఆదాయం దారుణంగా పడిపోతున్నది. కేవలం కొద్ది మంది ఆధారపడ్డ రొయ్యలు, పౌల్ట్రీ వంటి వాటి నుండి ఎక్కువ ఆదాయం వస్తున్నది. అంటే వ్యవసాయ రంగం నుండి వచ్చే ఆదాయంలో ఎక్కువ భాగం కొద్ది మందికి మాత్రమే వెళు తున్నది. ఈ పరిణామం వ్యవసాయ రంగంలో సంపద, భూ కేంద్రీకరణ, భూములు కోల్పోవడం, దివాళా, అప్పుల పాలవడం, వలసలు పెరగడం, ఆత్మహత్యలు వంటి చర్యలకు దారితీస్తున్నది. ఈ కఠోర వాస్తవ పరిస్థితులను రాష్ట్ర జిడిపి అంకెలు మరుగున పరుస్తున్నాయి. ఇతర రంగాల్లో కూడా దీనికి భిన్నమయిన పరిస్థితేమీ కాదు. జిడిపి వృద్ధి రేటు కన్నా అతి తక్కువ ఉపాధి రేటు ఈ కాలంలో కొనసాగుతున్నది. దీనినే ఉపాధి రహిత అభివృద్ధి అంటున్నారు. రెండోవైపు శ్రామిక మార్కెట్ లోకి శ్రామిక శక్తి ప్రవేశ రేటు పెరుగుతున్నది. వీరందరికీ పెరుగుతున్న జిడిపి ఉపాధి కల్పించలేక పోవడంతో వారంతా నిరుద్యోగులుగా మారిపోతున్నారు. వస్తున్న ఉపాధి కూడా ఎక్కువ రంగాల్లో అతి తక్కువ వేతనాలతో కూడిన ఏ హక్కులూ లేని అత్యంత దారుణమైనది. దీనివల్ల అత్యధిక శ్రామిక జనావళికి కొనుగోలు శక్తి లేకుండా పోతున్నది. ఇది అంతిమంగా సమిష్టి డిమాండ్ కొరతకు దారి తీస్తున్నది. ఈ విపత్కర పరిస్థిని సరిదిద్దేందుకు పాలకులు ఆర్థిక వ్యవస్థలో జోక్యం చేసుకోవాలి. కనీసం కార్మికులు కనీస జీవన స్థాయిలో జీవించేందుకు సరిపడా కనీస వేతనాలు ఎప్పటికప్పుడు నిర్ణయిస్తూ అమలు చేయించాలి. కార్మిక, సామాజిక భద్రత వంటి అత్యంత ముఖ్యమైన చట్టాలను కుడా అమలు పరచాలి.

## సంక్రాంతికి గ్రామాల్లో అన్న క్యాంటీన్లు



**అమరావతి, పతాకం న్యూస్:** గ్రామీణ ప్రజలకు సంక్రాంతి కానుకగా ఏపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్లు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ నియోజకవర్గ, మండల కేంద్రాల్లో ఒకేసారి 70 అన్న క్యాంటీన్లు ప్రారంభించనున్నట్లు తెలిపింది. ప్రస్తుతం వివిధ దశల్లో ఉన్న క్యాంటీన్ల నిర్మాణ పనులు జనవరి 10లోగా పూర్తి చేయనుండగా, జనవరి 13 నుంచి 15 మధ్య క్యాంటీన్లు ప్రారంభించే యోచనలో ప్రభుత్వం ఉంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఇప్పటికే పట్టణ ప్రాంతాల్లో 205 అన్న క్యాంటీన్లు ప్రారంభించి కొనసాగిస్తున్న సంగతి తెలిసిందే. వీటిలో రోజూ మూడు పూటలా కలిపి 2 లక్షల మందికిపైగా ప్రజలు భోజనం చేస్తున్నారు. ఉదయం, రాత్రి అల్పాహారం, మధ్యాహ్నం భోజనాన్ని పూటకు రూ.5కే అందిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ క్యాంటీన్లు ఏర్పాటు చేయాలన్న ఎమ్మెల్యేల విజ్ఞప్తి నేపథ్యంలో ప్రభుత్వం మరో 70 క్యాంటీన్లను మంజూరు చేసింది. పట్టణాలు, నగరాల్లో కొనసాగుతున్న 205 అన్న క్యాంటీన్ల ద్వారా ఇప్పటి వరకు 7.20 కోట్ల మందికిపైగా పేదలకు ఆహారం అందించారు. వీరిలో 3.16 కోట్ల మంది మధ్యాహ్న భోజనం చేయగా, 2.62 కోట్ల మంది ఉదయం అల్పాహారం, 1.42 కోట్ల మంది రాత్రి అల్పాహారం పొందారు. విశాఖపట్నం, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో అన్న క్యాంటీన్లకు అత్యధిక స్పందన లభిస్తోంది.

## రూ.12,015 కోట్లతో ఢిల్లీ మెట్రో విస్తరణ.. కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన బుధవారంనాడు జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. ఢిల్లీ మెట్రో ఫేజ్ 5(ఏ) విస్తరణకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందుకోసం రూ.12,015 కోట్లు కేటాయించారు. 13 కొత్త స్టేషన్లను కలుపుతూ 16 కిలోమీటర్ల మేరకు ఈ విస్తరణ పనులు చేపడతారు. దీంతో రాబోయే మూడేళ్లలో ఈ ర్యాపిడ్ ట్రాన్స్‌పోర్ట్ నెట్‌వర్క్ 400 కిలోమీటర్ల మార్క్‌ను చేరనుంది. ఫేజ్ 5 (ఏ)లో భాగంగా 16 కిలోమీటర్ల మేర 3 నూతన కారిడార్లను ఢిల్లీ మెట్రో కార్పొరేషన్ (డీఎంఆర్‌సీ) నిర్మించనున్నట్టు కేబినెట్ సమావేశానంతరం కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ మీడియాకు తెలిపారు. ఢిల్లీ మెట్రో చరిత్రలో ఇదొక మైలురాయని చెప్పారు. ఈ ప్రాజెక్టుతో 33,000 టన్నుల కర్బన ఉద్గారాలను తగ్గించవచ్చని, రాబోయే మూడేళ్లలో ఈ ప్రాజెక్టు పూర్తవుతుందని అంచనా వేస్తున్నామని తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఢిల్లీ మెట్రో ఆపరేషనల్ లెంగ్త్ 400 కిలోమీటర్లను అధిగమిస్తుందని, ప్రపంచంలోనే అతి పెద్ద అర్బన్ రైల్ నెట్‌వర్క్‌గా నిలుస్తుందని వివరించారు.

## ఎన్టీపీసీ అధికారులతో సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే పంచకర్ల



**పరవాడ, పతాకం న్యూస్:** పరవాడ మండలంలో నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్టిపిసి) ప్రధాన కార్యాలయంలో బుధవారం అధికారులతో, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులతో ఆయన మాట్లాడుతూ ఎన్టిపిసి కాలుష్య బాధిత గ్రామాల్లో సిఎస్సార్ నిధులతో అభివ ృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. అదేవిధంగా ఎన్టిపిసి నిర్వహణకు అవసరమైన ముడి సరుకులు రవాణా చేసే లారీల వలన విపరీతమైన కాలుష్యం ఏర్పడుతుందని, రవాణా సమయంలో లారీలకు తార్పలిన్స్ పూర్తిగా కప్పడం, అధిక లోడుతో ప్రయాణించకుండా జాగ్రత్తలు వహించాలని ఆదేశించారు.ఎన్టీపిసిలో నిరుద్యోగ యువతకి ఉపాధి కల్పించాలని, చుట్టుపక్క గ్రామాల యువకులకు ఉపాధికి ముందుగా వారికి శిక్షణ ఇవ్వడానికి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ఎన్టిపిసి కాలుష్య బాధిత గ్రామాల్లో సిఎస్ఆర్ నిధులతో అభివ ృద్ధి చేపట్టి, కాలుష్య నిరోధక యంత్రాలు వినియోగించాలని ఎన్టిపిసి అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్టిపిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీర్ శర్మ, జనరల్ మేనేజర్ అహ్మద్ కౌనియన్ రాజా, జనరల్ మేనేజర్ (నిర్వహణ) హెచ్.కె.వర్మ, (ఏజీఎం) బీబీ పాత్ర, తదితరులు పాల్గొన్నారు.

## బుచ్చంపేట విద్యార్థి జిల్లాస్థాయి వకృత్వ పోటీలో ప్రథమ బహుమతి

**రోలుగుంట, పతాకం న్యూస్:** అనకాపల్లి జిల్లా మండల కేంద్రమైన రోలుగుంటలో జాతీయ వినియోగ దారుల దినోత్సవాన్ని పురస్కరించు కుని అనకాపల్లి జిల్లాలో నిర్వహించిన జిల్లాస్థాయి వక ృత్వ పోటీలలో రోలుగుంట మండలం బుచ్చంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని చుక్కా కాంచనగంగ ప్రథమ స్థానాన్ని సాధించి మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఈ పోటీలు డిసెంబర్ 18 నుంచి 24 వరకు జిల్లా వ్యాప్తంగా జరిగాయి.

## సినిమా టికెట్ల రేట్లపై కీలక సమావేశం.. ఏపీ మంత్రి కందుల దుర్గేశ్ ఏమన్నారంటే..!



**అమరావతి, పతాకం న్యూస్:** భారీ బడ్జెట్ తో తెరకెక్కే చిత్రాలకు ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు ప్రీమియర్ షోలకు, టికెట్ ధరలు పెంచుకోవడానికి అనుమతిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా ఈరోజు ప్రభుత్వ ఉన్నతాధికారులు, సినీ ప్రముఖులతో ఏపీ సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేశ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... సినిమా విడుదల అయ్యేటప్పుడు అప్పటికప్పుడు టికెట్ ధరలు పెంచుకోకుండా, ఒక సమగ్ర విధానాన్ని అమలు చేస్తామని తెలిపారు. ఇటు సినీ పరిశ్రమకు, అటు ప్రేక్షకులకు న్యాయం జరిగేలా టికెట్ రేట్లు ఉండేలా చర్చలు జరుపుతున్నామని వెల్లడించారు. సినిమా విడుదలైన ప్రతిసారి రేట్లు పెంచడం వల్ల చాలా ఇబ్బందులు వస్తున్నాయని దుర్గేశ్ తెలిపారు. ప్రతిసారి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని, టికెట్ రేట్ల పెంపుకు సంబంధించి ఒకే జీవో ఉండేలా నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఆర్టిస్టుల రెమ్యునరేషన్ పై కూడా చర్చించి నిర్ణయం తీసుకుంటామని అన్నారు.

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న పవన్ - స్వయంగా వృద్ధురాలి ఇంటికి వెళ్లి ఆర్థికసాయం



**గుంటూరు, పతాకం న్యూస్:** ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఇప్పటం గ్రామంలో పర్యటించారు. వృద్ధురాలు నాగేశ్వరమ్మ కొత్తగా నిర్మించుకున్న ఇంటికి ఆయన వెళ్లారు. పవన్‌కల్యాణ్‌ను నాగేశ్వరమ్మ దంపతులు ఆప్యాయంగా ఆహ్వానించారు. ఆ దంపతులను ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్న పవన్ వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్సీపీ హయాంలో రోడ్డు విస్తరణ పేరుతో ఇప్పటంలో జనసేన కార్యకర్తల ఇళ్లు కూల్చివేశారు. జనసేన ఆవిర్భావ సభకు భూములు ఇచ్చారనే కక్షతో ఇలా చేశారనే ఆరోపణలున్నాయి. అప్పట్లో పవన్ కల్యాణ్ ఈ గ్రామంలో పర్యటించి బాధితులకు ధైర్యం చెప్పారు. ఎన్నికల్లో గెలిచాక మళ్లీ రావాలని ఇండ్ల నాగేశ్వరమ్మ అనే వృద్ధురాలు ఆయన్ను కోరింది. ఈ నేపథ్యంలో ఆమెకు ఇచ్చిన మాట మేరకు ఇప్పటం చేరుకున్న పవన్ నాగేశ్వరమ్మ ఇంటికి వెళ్లారు. ఆయనకు వృద్ధురాలు ఆప్యాయంగా స్వాగతం పలికారు. ఆమెను పవన్ ఆత్మీయ ఆలింగనం చేసుకుని యోగక్షేమాలు తెలుసుకున్నారు. వృద్ధురాలికి రూ.50 వేలు, ఆమె మనవడి చదువుకు రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. నాగేశ్వరమ్మ కుటుంబసభ్యులతో ఆయన మాట్లాడారు. ఆమె మనవడి చదువు కోసం ప్రతి నెలా తన వేతనం నుంచి రూ.5 వేలు ఇవ్వాలని పవన్ నిర్ణయించారు. అలాగే మనవడికి ఉద్యోగం కావాలని అడగగా పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం నాగేశ్వరమ్మ మాట్లాడుతూ, ఇచ్చిన మాట ప్రకారం పవన్ తమ ఇంటికి రావడం సంతోషంగా ఉందన్నారు. ఇంటికి పెద్ద కుమారుడిలా యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారని ఆనందం వ్యక్తం చేశారు. ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారని ఆమె చెప్పారు. కుటుంబానికి అండగా ఉంటామన్నారని తెలిపారు.

(మొదటిపేజీ తరువాయి)

## శరవేగంగా అమరావతి నిర్మాణ పనులు

అమరావతి నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. కొన్ని కేంద్ర ప్రభుత్వ సంస్థలకు రాజధానిలో భూములను కేటాయించారు. అయితే వాటి నిర్మాణాలు ప్రారంభం కావాలంటే అక్కడకు చేరుకునే రహదారులు పూర్తి చేయాలి. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం, సీఆర్డీఏ యంత్రాంగం వీటిపై దృష్టి సారించాయి. అందుకు అనుగుణంగా నిర్మాణాలకు సంబంధించిన ఏర్పాట్లు ఇప్పటికే మొదలయ్యాయి. జనవరి నుంచి అన్ని పనులు పూర్తిస్థాయిలో ఊపందుకోనున్నాయి. కూటమి ప్రభుత్వం రాజధానిలో చేపడుతున్న పనులపై రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అమరావతి రైతుల సమస్యల పరిష్కారంపైనా ప్రభుత్వం దృష్టి సారించింది. దీనికి 11 గ్రామాల్లో సీఆర్డీఏ కార్యాలయాలను ఏర్పాటు చేసింది. రాజధాని భూ సమీకరణ సమయంలో ఉన్నటువంటి సీఆర్డీఏ కార్యాలయాలను జగన్ సర్కార్ నిర్ధాక్షిణ్యంగా తీసివేసింది. అంతేకాకుండా తుళ్లూరులో సీఆర్డీఏ కార్యాలయం ఉన్నప్పటికీ అక్కడ అన్నదాతలను పట్టించుకునే వారు కాదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామాల్లో సీఆర్డీఏ కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. అమరావతికి భూములు ఇచ్చిన కర్షకులకు కౌలు సకాలంలో అందిస్తున్నారు. కౌలుకు సంబంధించిన సమస్యలేమైనా ఉంటే స్థానిక సీఆర్డీఏ కార్యాలయంలో సంప్రదిస్తున్నారు. రైతులకు ప్రభుత్వం ఇచ్చిన ప్లాట్లను విక్రయించాలంటే రిజిస్ట్రేషన్లు సైతం వీటిలో జరిగేలా అన్ని ఏర్పాట్లు చేశారు. వీటిద్వారా అన్నదాతలకు మంచి సౌలభ్యం కల్పించినట్లయింది.

## తేవాలని మంత్రుల చర్చ

నిర్మాణాలు చేసేందుకు నిబంధనలు ఒప్పుకోవని తేల్చారు. చర్యలపై కేబినెట్?కు నివేదిక : మిగిలిన 2 ఎకరాలు సరిపోని కారణంగా రుషికొండ సమీపంలోనే అదనంగా భూముల లభ్యతపై ద ృష్టి సారించాలని అధికారులను మంత్రి వర్గ ఉపసంఘం ఆదేశించింది. రెండు రోజుల్లో మరో సారి సమావేశమై భూముల లభ్యత సహా ప్యాలెస్?లపై అదనపు భవంతుల నిర్మాణాల అంశాలపై సమగ్రంగా చర్చించనున్నారు. ఎవరికి భవనాలు అప్పగించాలనే అంశంపైనా సుదీర్ఘంగా చర్చించనున్నారు. అనంతరం ప్రభుత్వ పరంగా తీసుకువాల్సిన చర్యలపై నివేదిక రూపొందించి వచ్చే కేబినెట్?కు నివేదిక ఇవ్వాలని నిర్ణయించారు. గత ప్రభుత్వం విధానాలతో ప్రభుత్వానికి భారీ నష్టం వాటిల్లగా, వాటిని వినియోగంలోకి తీసుకురావడం తలనొప్పిగా మారిందని మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు.

# నూతన అంబులెన్స్‌లు ప్రారంభోత్సవం చేసిన ఎమ్మెల్యే మత్స్యలింగం



**అరకులోయ, పతాకం న్యూస్:** గిరిజన ప్రాంతాల్లో అత్యవసర వైద్య సేవలను మరింత బలోపేతం చేయడంలో భాగంగా అరకు నియోజకవర్గంలో రెండు నూతన అంబులెన్స్‌లను ప్రారంభించారు. అరకులోయ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం చేతుల మీదుగా కొబ్బరికాయ కొట్టి, రిబ్బన్ కట్ చేసి అంబులెన్స్‌లను ప్రారంభించారు. ఈ రెండు అంబులెన్స్‌లలో ఒకటి అరకు పార్లమెంట్ సభ్యురాలు గుమ్మ తనుజరాణి నియోజకవర్గ అభివృద్ధి (ఎంపీ) నిధులతో, మరొకటి యూనివర్సల్ సంపో జనరల్ ఇన్సూరెన్స్ (ప్రైవేట్ లిమిటెడ్) సంస్థ సురక్ష – హమేషా ఆప్కే సాథ్ నిధులతో సమకూర్చబడ్డాయి. ఈ అంబులెన్స్‌లను డుంబ్రిగూడ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి, అరకు ఏరియా ఆసుపత్రికి చెరో ఒకటి కేటాయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం మాట్లాడుతూ "అత్యవసర సేవల కోసం ఈ అంబులెన్స్‌లు ఎల్లవేళలా గిరిజనులకు 24 గంటలు అందుబాటులో ఉంటాయి. ప్రజలు ఈ సేవలను పూర్తిగా వినియోగించుకోవాలి. ఈ నూతన అంబులెన్స్‌లు అత్యవసర వైద్య సేవలను మరింత వేగంగా, సులభంగా అందించేందుకు ఎంతో ఉపయోగపడతాయి" అని పేర్కొన్నారు.

# గర్భిణులకు అత్యాధునిక సేవలు



**నర్సీపట్నం, అనకాపల్లి, పతాకం న్యూస్:** నర్సీపట్నం, అనకాపల్లి ఏరియా ఆస్పత్రుల్లో నూతన సంవత్సర కానుకగా గర్భిణులకు టిఫా స్కానింగ్ మిషన్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. గర్భిణులు శిశు సంరక్షణ కోసం డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్(డీసీహెచ్) ఆస్పత్రులకు ప్రభుత్వం ఒక్కొక్కటి రూ.30.48 లక్షల విలువ చేసే టిఫా స్కానింగ్ యంత్రాలను మంజూరు చేసింది. నర్సీపట్నం ఆస్పత్రికి ఇప్పటికే టిఫా స్కానింగ్ చేరుకుంది. మహిళ గర్భం దాల్చి నెలలు నిండిన తరువాత ఈ మిషన్ ద్వారా స్కానింగ్ చేస్తామని డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఇది అత్యంత ఆధునిక స్కానింగ్ మిషన్ అని, 18 నుంచి 22 వారాల గర్భస్థ శిశువు ఆరోగ్య పరిస్థితి, లోపాలను గుర్తించడానికి ఉపయోగపడుతుందని నర్సీపట్నం ప్రాంతీయ ఆస్పత్రి రేడియాలజిస్ట్ డాక్టర్ శోభ తెలిపారు. నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో నెలకు సగటున 320 ప్రసవాలు జరుగుతుంటాయి. ఇందులో 65 శాతం సుఖ ప్రసవాలు, 35 శాతం సిజేరియన్లు వుంటున్నాయి. నర్సీపట్నం, నాతవరం, గొలుగొండ, మాకవరపాలెం, కోటవురట్ల, రోలుగుంట, రావికమతం మండలాలతోపాటు అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలం నుంచి రోజూ వంద మందికిపైగా గర్భిణులు గైనికాలజీ ఓపీకి వస్తుంటారు. గర్భస్థ శిశువు ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవడానికి అల్ట్రా సౌండ్ స్కానింగ్ చేస్తారు. ఏరియా ఆస్పత్రిలోని స్కానింగ్ సెంటర్‌లో రోజుకు 40 నుంచి 50 మందికి పరీక్షలు చేస్తుంటారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత స్పీకర్ అయ్యన్నపాత్రుడు కృషితో ఏరియా ఆస్పత్రిలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి. తాజాగా టిఫా స్కానింగ్ మిషన్ మంజూరైంది. దీనిని మొదటి అంతస్థులోని స్కానింగ్ సెంటర్‌లో అమర్చారు. జనవరి ఒకటో తేదీ నుంచి టిఫా స్కానింగ్ సేవలు అందుబాటులోకి వస్తాయని, గర్భస్థ శువు ఏ స్థితిలో ఉంది, ఉమ్మనీరు స్థితిని తెలుసుకొని అందుకనుగుణంగా గర్భిణులకు వైద్యం చేయానికి ఉపయోగ పడుతుందని ఆస్పత్రి వైద్యాధికారులు తెలిపారు.

# పేరుకుపోతున్న ఫ్లైయాష్



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** థర్మల్ విద్యుత్ పవర్ ప్లాంట్ల ద్వారా వస్తున్న ఫ్లైయాష్ (బూడిద) వినియోగంలో వ్యూహాత్మక విధానాలు అనుసరించకపోవడంతో కాలుష్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఇటీవల దీనిపై సమీక్షించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఫ్లైయాష్‌ను 100 శాతం వినియోగించుకునేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఫ్లైయాష్‌ను పాండ్ (చెరువు)కు తరలించకుండా వినియోగదారులకు అందించే అంశాలపై అధికారులు దృష్టిసారించారు. జిల్లా వరకు చూస్తే పరవాడలోని ఎన్‌టీపీసీ థర్మల్ పవర్ ప్లాంటులో రోజుకు పది వేల టన్నుల ఫ్లైయాష్ ఉత్పత్తి అవుతోంది. దీనిని రెండేళ్ల క్రితం వరకు ఉచితంగా ఇచ్చేవారు. ఇటుకల తయారీదారులు దీనిని లారీల ద్వారా తీసుకువెళ్లేవారు. కేంద్ర ప్రభుత్వం యాష్ పాండ్లను ఖాళీ చేయాలని, నిల్వలు ఉంచకూడదని ఆదేశించింది. విద్యుదుత్పత్తి రంగంలో ఉన్న అదానీ సంస్థ ఆ బూడిదను కూడా క్యాష్ చేసుకోవడానికి యత్నించింది. ఎవరికీ ఉచితంగా ఇవ్వవద్దని, ఎంతో కొంత ధర చెల్లిస్తే సద్వినియోగం అవుతుందని ఆదేశాలు ఇప్పించింది. అప్పటివరకు ఉచితంగా లభించిన ఫ్లైయాష్‌ను డబ్బులు ఇచ్చి కొనుక్కోవలసిన పరిస్థితి ఏర్పడింది. దాంతో ఇటుకల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోయింది. ధరలు కూడా పెరిగాయి. ఇటుక తయారీదారులే సంఘాలుగా ఏర్పడి టెండర్లు వేసి టన్ను రూ.50 చొప్పున ఎన్‌టీపీసీ వద్ద కొనుగోలు చేసి, రూ.100 చొప్పున ఇటుక తయారీదారులకు విక్రయించడం ప్రారంభించాయి. అది కూడా వెంటనే ఇవ్వడం లేదు. లారీలను ప్లాంటు వద్ద నిలిపితే లోడింగ్‌కు గంటల సమయం పడుతోంది. దీంతో రవాణా చార్జీలు పెరగిపోతున్నాయి. ఫ్లైయాష్‌తో ఇటుకలు తయారుచేసే పరిశ్రమలు ఉమ్మడి జిల్లాలో సుమారు 300 వరకూ ఉన్నాయి. అవన్నీ పరవాడ ఎన్‌టీపీసీ ప్లాంటుపైనే ఆధారపడి పనిచేస్తున్నాయి. ఎన్‌టీపీసీ నుంచి బూడిదను సిమెంట్ పరిశ్రమలు కూడా తీసుకువెళుతున్నాయి. జాతీయ రహదారుల నిర్మాణంలో వినియోగిస్తున్నారు. ఇటీవల విదేశాలకు కూడా ఎగుమతి చేస్తున్నారు. పరవాడ ఎన్‌టీపీసీలో ఉత్పత్తి అయ్యే బూడిదను 100 శాతం వినియోగిస్తున్నామని చెబుతున్నా...పాండ్‌లో నిల్వలు భారీగానే ఉన్నాయి. హిందూజాలో ఈ నిల్వలు మరింత అధికం. భారీ వర్షాలు కురిసినప్పుడు బూడిద వర్షపు నీటితో కలిసి పరిసరాల్లోని పొలాల్లోకి వెళుతోంది. దాంతో అవి నిస్సారంగా మారిపోతున్నాయి. అదేవిధంగా పాండ్లలో నిల్వ చేసిన బూడిద గాలులకు ఎగిరి పరిసర గ్రామాలపైకి చేరి శ్వాసకోశ వ్యాధులకు కారణమవుతోంది. పిట్టవానిపాలెం గ్రామం ఈ కారణంగానే చాలావరకు ఖాళీ అయిపోయింది. ఈ సమస్యల నివారణకు వచ్చిన బూడిదను వచ్చినట్టు బయటకు పంపడానికి ఏర్పాట్లు చేయాల్సి ఉంది.

# కొత్తపట్నం వద్ద యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు



**రాంబిల్లి, పతాకం న్యూస్:** మండలంలోని కొత్తపట్నం సమీపంలో సముద్రతీరం వెంబడి ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు. రాత్రి పది గంటల తరువాత ఎక్స్‌కవేటర్లను ఏర్పాటు చేసిన ఇసుకను తవ్వి లారీలు, ట్రాక్టర్లలో తరలించుకుపోతున్నారు. రాంబిల్లి, అచ్యుతాపురం మండలాల పరిధిలోని ప్రత్యేక ఆర్థిక మండలిలో పరిశ్రమల ఏర్పాటుకు కేటాయించిన భూముల్లో 'ల్యాండ్ ఫిల్లింగ్' కోసం సముద్ర ఇసుకను వినియోగిస్తున్నారు. నదుల్లోని ఇసుక కంటే సముద్ర తీరంలోని ఇసుక తక్కువ ధరకు లభిస్తుండడం, ప్రత్యేక ఆర్థిక మండలికి చేరువలో వుండడంతో అక్రమార్కులకు బాగా కలిసొచ్చింది. పరిశ్రమలతోపాటు రియల్ ఎస్టేట్ వెంచర్లు, ఇతర ఖాళీ స్థలాలను ఎత్తు చేయడానికి కూడా సముద్ర ఇసుకను వినియోగిస్తున్నారు. ఈ ప్రాంతం అటవీ శాఖ పరిధిలో వుండడం, స్థానికంగా పర్యవేక్షణ లేకపోవడం, రెవెన్యూ అధికారులు తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తుండడంతో సముద్ర తీరంలో ఇసుక తవ్వకాలకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. మండలంలో కొత్తపట్నంతోపాటు మరికొన్ని గ్రామాల్లో కూడా సముద్ర తీరంలో ఇసుక అక్రమ తవ్వకాలు సాగుతున్నాయి. దూరాన్ని బట్టి ట్రాక్టర్ ఇసుక రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు విక్రయిస్తున్నట్టు తెలిసింది. అధికారులు వెంటనే స్పందించి, ఇసుక తవ్వకాలకు అడ్డుకట్ట వేయకపోతే తుఫాన్ల సమయంలో సముద్రం నీరు గ్రామాల్లోకి వచ్చే ప్రమాదం వుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# కశింకోట బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎంకు షోకాజ్ నోటీసు



**కశింకోట, అనకాపల్లి పతాకం న్యూస్:** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వర్ణకుమారికి జిల్లా విద్యా శాఖాధికారి షోకాజ్ నోటీసు జారీ చేశారు. మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఈ నెల 20వ తేదీన స్థానిక వైసీపీ నేతలు పాఠశాలలో వేడుకలు నిర్వహించారు. దీనిపై అందిన ఫిర్యాదుపై సమగ్ర విచారణ జరిపిన తరువాత హెచ్‌ఎంకు షోకాజ్ నోటీసు జారీ చేశామని డీఈవో అప్పారావు నాయుడు తెలిపారు. విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణల్లో రాజకీయ పార్టీల సమావేశాలు, ప్రచారాలు నిర్వహించకూడదని ప్రభుత్వం గతంలోనే జీవో జారీ చేసిందన్నారు. ఈ మేరకు జీవో కాపీతోపాటు షోకాజ్ నోటీసును హెచ్‌ఎంకు పంపారు. కాగా పాఠశాలలో వైసీపీ నేతల కార్యక్రమంపై హెచ్‌ఎం స్వర?కుమారిని వివరణ కోరగా.. జీవో విషయం తెలియక ఉన్నత పాఠశాలలో జన్మదిన వేడుకలను నిర్వహించామని చెప్పారు. షోకాజ్ నోటీసుపై మూడు రోజుల్లో లిఖితపూర్వకంగా వివరణ ఇస్తే దానిని ఉన్నతాధికారులకు పంపిస్తానని డీఈవో చెప్పినట్టు ఆమె తెలిపారు. మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఈ నెల 20వ తేదీన స్థానిక వైసీపీ నేత మళ్ల బుల్లిబాబు, సర్పంచ్ మంత్రి జయరజని, మరికొంతమంది వైసీపీ నాయకులు స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలకు వెళ్లారు. విద్యార్థినుల మధ్య జగన్ జన్మదిన వేడుకలను నిర్వహిస్తామని హెచ్‌ఎం స్వర్ణకుమారికి చెప్పారు. ఆమె నిరాకరించకపోగా వైసీపీ నాయకులను వెంటబెట్టుకుని ప్రతి తరగతి గదికి వెళ్లి బిస్కెట్లు, చాక్లెట్లు పంపిణీ చేయించారు. ఈ సందర్భంగా మళ్ల బుల్లిబాబు మాట్లాడుతూ, మీరంతా జగన్(మామ)ను మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని బాలికలను ఉద్దేశించి పిలుపునిచ్చారు. అనంతరం జై జగన్.. జైజై జగన్ అంటూ నినాదాలు చేయించారు.

# ఘనంగా 'మొర్రిగూడ'లో పెసా మహోత్సవం



**డుంబ్రిగూడ, పతాకం న్యూస్:** మండల కేంద్రంలోని మొర్రి గూడ గ్రామంలో పెసా (పంచా యత్ ఎక్స్‌టెన్షన్ టు షెడ్యూల్డ్ ఏరియాస్) మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్ర మానికి గసబ గ్రామ పంచాయతీ సర్పంచ్ పాంగి సునీత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తదంతరం సర్పంచ్ సునీత మాట్లాడుతూ, పెసా చట్టాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలు, వనరులను కాపాడాలని పెసా ఉపాధ్యక్షులు, కార్యదర్శులను కోరారు. గిరిజన భూములు అన్యాక్రాంతం కాకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. షెడ్యూల్డ్ ఏరియాల్లో ప్రాజెక్టుల నిర్మాణం, ఖనిజాల తవ్వకాలకు పెసా అనుమతి, గ్రామసభ ఆమోదం తప్పనిసరి అని ఆమె చెప్పారు. అదనంగా, చట్టవిరుద్ధ కార్యకలాపాలైన గంజాయి సాగు, నాటుసారా తయారీ మరియు అమ్మకాలను నిషేధించాలని డిమాండ్ చేశారు. గ్రామ సమస్యలను పెసా గ్రామసభలో చర్చించి పరిష్కరించాలని సలహా ఇచ్చారు. 1/70 భూ బదిలీ నియంత్రణ చట్టాన్ని మరింత పటిష్టం చేయడానికి అందరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గసబ మాజీ సర్పంచ్ పాంగి సురేష్ కుమార్, పంచాయతీ సెక్రటరీ కొర్రా గురుమూర్తి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ నాగేంద్ర, పెసా ఉపాధ్యక్షులు మరియు కార్యదర్శులు పాంగి కొత్తు, పాంగి క్రిష్ణమూర్తి, పాంగి ప్రదీప్, వంతాల చంపాస్ కుమార్, పాంగి రమేష్, పాంగి సోమేశ్ తదితరులు పాల్గొన్నారు.

# ఏ.బీ.ఎస్ పబ్లిక్ స్కూల్‌లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు



**పరవాడ, పతాకం న్యూస్:** గ్రేటర్ విశాఖ, 85వ వార్డు ఏ.బి.ఎస్ పబ్లిక్ పాఠశాలలో బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు శాంతా క్లాస్, గొర్రెల కాపరులు, దేవదూతలుగా వేషధారణతో విశేషంగా ఆకట్టుకున్నారు. చిన్నారులు ఏసు జననం, ఏసు జీవితంలో జరుగు అద్భుతాలు వంటి సన్నివేశాలను చిన్నారులు ఆకర్షణీయంగా రక్తి కట్టించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకులు పి.ఎం కొండయ్య దంపతులు, పాఠశాల ప్రిన్సిపల్ యు. పద్మజా,పాఠశాల డైరెక్టర్ యు. దీపక్ ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వాడవాడలా సీపీఐ శతవసంతాల వేడుకలను జయప్రదం చేయండి: సీపీఐ



**గొలుగొండ, పతాకం న్యూస్:** గొలుగొండ మండలం గుండుపాల,జిల్లెడుపూడి గ్రామాల్లో భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) శతవసంతాల వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. ఈ నెల 26న సీపీఐ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్క రించుకుని సీనియర్ నాయకులు మర్రి పేదరాము పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర సమితి సభ్యులు బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ దున్నేవానికే భూమి నినాదంతో భూస్వామ్య విధానానికి వ్యతిరేకంగా రైతుల పక్షాన సీపీఐ నిలిచిందని తెలిపారు. 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో సోషలిస్టు సమాజ లక్ష్యంగా పార్టీ ఆవిర్భవించిందని గుర్తు చేశారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా ప్రజా ఆస్తులను నాశనం చేస్తోందని విమర్శించారు.

# 'దుమ్మగూడ'లో అల్లూరి వాకర్ అసోసియేషన్ సహకారంతో గిరిజనులకు రగ్గుల పంపిణీ



**అరకులోయ, పతాకం న్యూస్:** అరకు వ్యాలీ మండలంలో తీవ్రమైన చలి కారణంగా గిరిజనులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, అల్లూరి వాకర్ అసోసియేషన్ సహకారంతో పద్మాపురం పంచాయతీలోని దుమ్మగూడ కాలనీలో 60 కుటుంబాలకు, వృద్ధులకు రగ్గులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని దుమ్మగూడ కాలనీ ఉప సర్పంచ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ గత కొద్ది రోజులుగా అరకు వ్యాలీలో ఉష్ణోగ్రతలు 3–5 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోవడంతో గిరిజన ప్రాంతాల్లో చలి తీవ్రత పెరిగింది. సకాలంలో అల్లూరి వాకర్ అసోసియేషన్‌కు వారి చేసిన సహాయమునకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కె. ధర్మ, ఎస్. బలరాం, జి. హరి, మాజీ వార్డ్ మెంబర్ కే. సన్నమ్మ, చంప కమల మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# వాటర్‌షెడ్ నిధులు స్వాహా?



**కొయ్యూరు, పతాకం న్యూస్:** మండలంలో సమగ్ర వాటర్‌షెడ్ యాజమాన్య పథకం కింద కేటాయించిన నిధులు పక్కదారి పట్టాయన్న ఆరోపణలు ఉన్నాయి. అధికారులు రికార్డుల్లో చూపించిన లెక్కలకు, క్షేత్ర స్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయన్న వాదన వినిపిస్తోంది. ఐటీడీఏ పరిధిలో కరువు పీడిత, వర్షపాతం తక్కువ, వర్షాధార భూములు, బీడు భూములు భౌగోళికంగా ఎత్తు పల్లాలు ఉన్న ప్రాంతాలను అభివ ృద్ధి పథంలో నడిపించేందుకు నిర్దేశించిన సమగ్ర వాటర్‌షెడ్ యాజమాన్య పథకం నిధులు మండలంలో పక్కదారి పట్టాయనే విమర్శలున్నాయి. మండలంలో వాటర్‌షెడ్ పథకం కింద 2021-22 సంవత్సరంలో కొయ్యూరు, మర్రివాడ, మంప, రావణాపల్లి, రేవళ్లు పంచాయతీలలో ఐదు వేల హెక్టార్లు అభివ ృద్ధి చేసేలా రూ.11 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో అప్పటి నుంచి ఇప్పటి వరకు రూ.3.76 కోట్లు వెచ్చించి సహజ వనరుల సంరక్షణ చర్యల్లో భాగంగా 12 విడి రాతి కట్టడాలు, 7 రాక్‌ఫిల్డ్ డ్యామ్‌లు, 19 గ్యాబియానులు, 29 చిన్న ఊట కుంటలు, 43 పెద్ద ఊట కుంటలు, 3 చెక్‌డ్యామ్‌లు, 41 ఫారంపాండ్స్, 2 అమ ృత సరోవర్‌లు నిర్మించినట్టు సంబంధిత వాటర్‌షెడ్ సిబ్బంది రికార్డులు రూపొందించారు. అలాగే వ్యవసాయ యాంత్రీకరణ చర్యల్లో భాగంగా రూ.50.82 లక్షలతో 618 వ్యవసాయ పరికరాలైన బరకాలు, బ్రష్ కట్టర్లు, బ్యాటరీ స్ప్రేయర్లు, త్రైవాన్ స్ప్రేయర్లు, ఆయిల్ ఇంజన్లు పంపిణీ చేసినట్టు చెబుతున్నారు. ఈ పథకం అమలు చేసే ఐదు పంచాయతీలలో 95 మంది రైతులతో 101 ఎకరాల్లో హార్టీకల్చర్ ప్లాంటేషన్(జీడి మామిడి 77 ఎకరాలు, మామిడి 4 ఎకరాలు, కొబ్బరి 14 ఎకరాలు, సపోటా 2 ఎకరాలు, నిమ్మ 3 ఎకరాలు) చేయించామని అంటున్నారు. అయితే ఈ పనుల పరిశీలనకు ఉన్నతాధికారులు వచ్చిన సందరాలేలో కేవలం మంప పంచాయతీ పరిధి కించవానిపాలెం, గంగవరంలో తవ్విన చిన్న, పెద్ద నీటి కుంటలు మాత్రమే చూపిస్తూ పబ్బం గడుపుతున్నారు తప్పితే, నిర్మించిన చెక్‌డ్యామ్‌లు, హార్టీకల్చర్ ప్లాంటేషన్ లబ్ధిదారులకు పంపిణీ చేసిన వ్యవసాయ యాంత్రీకరణ పరికరాల విషయాన్ని ప్రస్తావనకు తేవడం లేదు. ఐదు పంచాయతీల పరిధిలో ఒక్కో సోలార్ లైట్‌కు రూ.26,700లతో మొత్తం రూ.16.81 లక్షలు వెచ్చించి 63 సోలార్ వీధి దీపాలు వేయించారు. అయితే ఈ సోలార్ లెడ్ లైట్ రూ.8 వేలకు మించి లేకపోగా, ఒక్కో దానికి రూ.26 వేలు పైబడి ఖర్చు చూపించారు. ప్రస్తుతం ఐదు పంచాయతీల్లో ఏర్పాటు చేసిన సోలార్ లెడ్ లైట్ ఆన్‌లైన్‌లో రూ.2,600 నుంచి రూ.5,790 వరకు ఉన్నాయి. దీనిని బట్టి చూస్తే సోలార్ లైట్లలో రూ.10 లక్షల మేర నిధులు పక్కదారి పట్టినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే ఐదు పంచాయతీల పరిధిలో రైతులు సేదతీరేందుకు వీలుగా 136 సిమెంట్ బెంచీలను రూ.5.07 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసినట్టు చెబుతున్నారు. ఒక్కో సిమెంట్ బెంచీ రూ.3,700 వంతున కొన్నట్టు రికార్డుల్లో చూపిస్తున్నారు. నాణ్యతతో కూడిన సిమెంట్ బెంచీ ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో రూ.2 వేల నుంచి రూ.2,500 మధ్యలో దొరుకుతుండగా, నాణ్యత లేని బెంచీలు ఏర్పాటు చేసి నిధులు స్వాహా చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఐదు పంచాయతీల పరిధిలో చేపట్టిన పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అవినీతి ఆరోపణలపై నిగ్గు తేల్చాలని పలువురు కోరుతున్నారు.

## అప్పలరాజు అక్రమ అరెస్టుకు నిరసనగా ఆందోళన




**నర్సీపట్నం, పతాకం న్యూస్:** సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం. అప్పలరాజు అక్రమ అరెస్టును నిరసిస్తూ నర్సీపట్నం 5 రోడ్ల సెంటర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అడిగర్ల రాజు మాట్లాడుతూ, నక్కపల్లిలో ప్రజల పక్షాన సీపీఎం చేపడుతున్న పోరాటాలను అణచివేయాలనే ఉద్దేశంతోనే అప్పలరాజుపై తప్పుడు కేసులు పెట్టారని ఆరోపించారు. అక్రమ కేసులతో ప్రజా ఉద్యమాలను ఆపలేరని స్పష్టం చేశారు. అప్పలరాజుపై పెట్టిన తప్పుడు కేసులను వెంటనే రద్దు చేసి, తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సీపీఎం నాయకులు ఈరెల్లి చిరంజీవి, డి. శివ, నానాజీ, గోవింద్, రమణ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలపై విద్యార్థులకు అవగాహన




**నర్సీపట్నం, పతాకం న్యూస్:** జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు, నర్సీపట్నం సబ్‌డివిజన్ డీఎస్పీ పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నర్సీపట్నం మండలం వేములపూడి గ్రామంలోని జడ్పీహెచ్ పాఠశాలలో 'సంకల్పం' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం రూరల్ సర్కిల్ సీఐ ఎల్.రేవతమ్మ, సర్కిల్ ఎస్ఐ రమేష్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు. విద్యార్థులకు గంజాయి తదితర మత్తు పదార్థాల వాడకంతో కలిగే ప్రమాదాలను వీడియోల ద్వారా వివరించి, వాటి దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ రేవతమ్మ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని, గంజాయి లేదా డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే 112, 1972 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. "వద్దు వద్దు గంజాయి వద్దు SAY NO TO DRUGS నినాదాలతో 500 మంది విద్యార్థులు వేములపూడి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు క్రమశిక్షణతో, ఉన్నత విలువలతో ఎదిగి బాధ్యతగల పౌరులుగా మెలగాలని అధికారులు సూచించారు.

# నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి



**చోడవరం, పతాకం న్యూస్ :** వడ్డాదిలో నాయీ బ్రాహ్మణుల సంక్షేమ సంఘం భవన నిర్మాణానికి స్థలం కేటాయి స్తామని స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, టిడిపి జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్య బాబు అన్నారు. వడ్డాదిలో నిర్వహించిన నాయీ బ్రాహ్మణుల ఆత్మీయ వన సమారాధనలో పాల్గొన్నారు. అర్హత ఉన్న నాయీ బ్రాహ్మణులందరికీ ఇళ్ల స్థలాలు,ఇల్లు మంజూరు చేస్తామన్నారు. ఎమ్మెల్యే రాజుతో చర్చించి జిల్లా వాయిద్య కళాకారుల సంఘ భవనానికి వెంకన్నపాలెంలో స్థలం కేటాయించేందుకు కృషి చేస్తానన్నారు. కూటమి ప్రభుత్వం చేతివృత్తుల వారి సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. నాయీ బ్రాహ్మణులకు ఖాదీ బోర్డు రుణాలు మంజూరుకి సహకారం అందిస్తానన్నారు. పిల్లలను ఉన్నతంగా చదివించాలన్నారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యం అన్నారు. అన్ని విధాలా నాయీ బ్రాహ్మణులకు అండగా ఉంటాను అన్నారు. ఈ సమావేశంలో స్థానిక పిఎసిఎస్ చైర్మన్ దొండా నరేశ్, నేతలు రమేశ్, తలారి శంకర్, గురుమూర్తి,కనక, స్థానిక నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కాకినాడ శేషు, సింహాచలం, ఉపాధ్యక్షుడు బిల్లకుర్తి హరినాథ్, సంయుక్త కార్యదర్శి నానాజీ, కార్యదర్శి కే శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కేసనకుర్తి అప్పారావు రిటైర్డ్ ఎస్సై, కందిగొప్ప గోవిందరావు, జిల్లా వాయిద్య కళాకారుల సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.ప్రసాద్, పి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బత్తుల తాతయ్యబాబుని,దొండా నరేశ్ ను సత్కరించారు.

## పెసా చట్టం అమలు తీరు పరిశీలన



**అనంతగిరి, పతాకం న్యూస్:** పెసా చట్టం అమలు తీరును పరిశీలించేందుకు దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రజాప్రతినిధులు చిలకలగెడ్డ, కాశీపట్నం, కొండిబలో పర్యటించారు. వారికి డ్వాక్రా మహిళలు, స్థానిక ప్రజాప్రతినిధులు థింసా న ృత్యాలతో స్వాగతం పలికారు. వారంతా ముందుగా చిలకలగెడ్డ, కాశీపట్నంలో నిర్వహించిన పెసా మహోత్సవంలో గిరిజనులు పండించిన రాజ్‌మా, సాములు, కొర్రాలు, తదితర వాటితో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. పెసా చట్టం గిరిజన ప్రాంతంలోని ఏ విధంగా అమలవుతోంది, దాని వలన గిరిజనులకు కలుగుతున్న లాభాలపై చిలకలగెడ్డ, కాశీపట్నంలోని గిరిజనులను అడిగి తెలుసుకున్నారు. పెసా చట్టం గిరిజనులకు రక్షణ కవచమని, గిరిజన సంప్రదాయాలను, సంస్కృతిని కాపాడుకోవడంతో పాటు సహజ వనరులను ఉపయోగించుకోవడం, గిరిజనులు దోపిడీ నుంచి విముక్తి కలిగించేలా ఈ చట్టం ఉందని వారికి గిరిజనులు వివరించారు. వెలుగు ద్వారా డ్వాక్రా మహిళలు పొందిన రుణాలను ఉపయోగించిన తీరును క్షుణ?ంగా వివరించారు. జీవో నంబరు 3 రద్దు కావడంతో గిరిజనులు ఉద్యోగావకాశాలను కోల్పోతున్నారని, వ్యవసాయ రంగానికి జాతీయ ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేయాలని గ్రామపెద్దలు కోరారు. అనంతరం కొండిబలో స్థానిక గిరిజన మహిళలు ఆకులతో తయారుచేసిన టోపీలను వివిధ రాష్ట్రాల ప్రజాప్రతినిధులకు అందించగా వారు స్వీకరించి ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గుజరాత్, జార?ండ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మధ్యప్రదేశ్, తెలంగాణ, హిమచల్‌ప్రదేశ్, రాజస్థాన్, తదితర రాష్ట్రాలకు చెందిన ప్రజాప్రతినిధులతో పాటు కొండిబ, కాశీపట్నం సర్పంచులు పున్నమ్మ, లక్ష్మి, ఎంపీడీవో ప్రభాకర్, తహశీల్దార్ వీరభద్రాచారి, ఏపీఎం రమేశ్, కార్యదర్శులు శైలజ, బేగం, లేబర్ బోర్డు డైరెక్టర్ మోస్య జోగులు, కో ఆప్షన్ సభ్యుడు మదీనా, దయానిధి, మధుసూదన్, మూర్తి, పెసా అధ్యక్ష, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు శాఖ ఆధ్వర్యంలో చిన్నయ్యపాలెం గ్రామస్తులకు చట్టాలపై అవగాహన




**రాజవొమ్మంగి, పతాకం న్యూస్ :** జడ్డంగి పోలీస్ స్టేషన్ పరిధిలోని చిన్నయ్య పాలెం గ్రామంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విస్తృతంగా చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గౌరిశంకర్ , జడ్డంగి ఎస్ఐ చినబాబు పాల్గొని గ్రామ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా గంజాయి, సారా (అక్రమ మద్యం) వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, వాటి కారణంగా కుటుంబాలు మరియు సమాజంపై పడే ప్రతికూల ప్రభావాలను వివరించారు. గంజాయి మరియు సారా వంటి అక్రమ కార్యకలాపాల్లో ఎవరైనా పాల్గొంటే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తూ, హెల్మెట్ ధరించడం, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రాణాంతక ప్రమాదాలకు దారి తీస్తుందని తెలిపారు. బాల్యవివాహాల దుష్పరిణామాలు గురించి వివరించి, బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, అటువంటి ఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని గ్రామస్తులను కోరారు. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమం అనంతరం చిన్నయిపాలెం గ్రామ యువతకు వాలీబాల్ కిట్‌ను అందజేయడం జరిగింది. యువత క్రీడలవైపు దృష్టి సారించి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరుచుకోవాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చిన్నయ్య పాలెం గ్రామస్తులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## 26న అగనంపూడి సీడబ్ల్యూసీలో సదస్సు

**అగనంపూడి, పతాకం న్యూస్ :** జాతీయ వినియోగదారుల వారోత్సవాల్లో భాగంగా 26న అగనంపూడి సి డబ్ల్యూసిలో మధ్యాహ్నం 3 గంటల నుండి వినియోగ దారుల హక్కులు,సమాజ హితం అన్న అంశంపై సదస్సు నిర్వహించనున్నారు. ఈ సదస్సు కి ముఖ్య అతిథిగా జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమీషన్ 1 అధ్యక్షులు (జడ్జి) డాక్టర్ జి తనూజా రెడ్డి హాజరు అవుతారని వినియోగదారుల హక్కుల పరిరక్షణ సమితి కన్వీనర్ పట్టా రామా అప్పారావు తెలిపారు . ఈ సదస్సును నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిస్తూ ప్రచార పోస్టర్ ను మంగళవారం ఆవిష్కరించారు.

## విజయనగరంలో క్రిస్మస్ సందడి



**విజయనగరం, పతాకం న్యూస్:** నగరంలో క్రిస్మస్ పండుగ సందడి నెలకొంది. చర్చిలు విద్యుత్ దీపాలతో కొత్త కాంతులు సంతరించుకున్నాయి. పది రోజులుగా వివిధ చర్చిల్లో వేడుకలు జరుగుతున్నాయి. ఈ నెల 25న అసలు పండుగ సందర్భంగా విజయనగరంలోని ప్రధాన చర్చిలు.. ఇళ్ల ముందు క్రిస్మస్ స్టార్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. క్రిస్టియన్ స్వచ్ఛంద సంస్థలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. క్రిస్మస్ కేక్‌లు కట్ చేసి సందడి చేస్తున్నారు. నగరంలోని అతి పురాతన మైన బాప్టిస్ట్ చర్చి, ఆర్‌సీఎం , సెయింటాన్స్, సెయింట్ లూథరన్, స్వీమ్స్ ప్లాటినం చర్చిలు విద్యుత్ కాంతులతో కళకళలాడుతున్నాయి.

## వికసిత్ భారత్ లక్ష్యంగా సాగుదాం: దినకర్




**విజయనగరం, పతాకం న్యూస్:** స్వర్ణాంధ్ర-వికసిత్ భారత్ లక్ష్యంగా ముందుకు సాగుదామని 20 సూత్రాల కార్యక్రమం అమలు చైర్మన్ లంకా దినకర్ అన్నారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి వివిధ పథకాల అమలు తీరుపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందరరేగా ఆయన మాట్లాడుతూ.. 2019-2024 మధ్య ఉపాధిహామీ పనులకు సంబంధించిన వ్యయం, నష్టపోయిన నిధుల లెక్కలు వివరించారు. ఇందులో శతశాతం వేతనాల వినియోగం జరిగినట్లు లెక్కలు చూపించారు. కేవైసీ చేస్తే ఎంతమంది తగ్గారు? నిధులు ఎవరి జేబులలోకి వెళ్లాయి? అనే నిజాలు బయట పడతాయన్నారు. వేతనదారులకు 100 నుంచి 125 పని దినాలు కల్పించడం, రైతులకు సకాలంలో కూలీలను అందుబాటులో ఉంచాలన్నారు. మొత్తం 185 దినాల కూలీ దొరికేలా జిల్లాకు నిధులు తేవడానికి ప్రణాళికలు తయారు చేయాలని ఆదేశించారు. ఈ సందరరేగా బిల్లుల చెల్లింపులపై చైర్మన్‌కు కలెక్టర్ వివరించారు. అనంతరం మీడియాతో లంకా దినకర్ మాట్లాడుతూ... ఈ ఏడాది ఇంతవరకు 17,213 మంది శిశువులు ప్రభుత్వాసుపత్రుల్లో జన్మించారని తెలిపారు. గర్భిణులకు అవసరమైన వైద్యం, మందులు అందజేసి 'రక్తహీనత విముక్త భారత్' కోసం క ృషి చేస్తున్నట్లు చెప్పారు. 2025-26కు సంబం ధించి ఈ కార్యక్రమం అమలు బాధ్యతను ఐసీడీఎస్‌కు బదిలీ చేశామన్నారు. డా.ఎన్టీఆర్ వైద్యసేవల ద్వారా ఇప్పటి వరకు జిల్లాలో రూ.380 కోట్లతో 2.11లక్షల మందికి చికిత్సలు అందించామని తెలిపారు. వీటితో పాటు మరికొన్ని పథకాల అమలు తీరును వివరించారు. పీఎం సూర్యఘర్ పథకం అమలులో వేగం పెంచాలన్నారు. సమావేశంలో శ్రీకాకుళం, నరసన్నపేట, ఎచ్చెర్ల ఎమ్మెల్యేలు గొండు శంకర్, బగ్గు రమణమూర్తి, నడుకుదిటి ఈశ్వరరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ కె.అనిత, సీపీఓ లక్ష్మీప్రసన్న, మునిసిపల్ కమిషనర్ ప్రసాదరావు, డీసీ హెచ్ఎస్ డా.కల్యాణ్ బాబు, డ్వామా పీడీ లవరాజు, డీఈవో రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మెరుగైన రవాణా సౌకర్యమే లక్ష్యం



**నరసన్నపేట, పతాకం న్యూస్:** ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యం అని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. లుకలాం గ్రామంలో లుకలాం టూ శ్రీకాకుళం వయా నరసన్నపేట ఆర్టీసీ పల్లెవెలుగు సర్వీసును ఆయన ప్రారంభిం చారు. నియోజవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, ఆర్టీసీ డీఎంతోపాటు టీడీపీ నాయకులు జల్లు చంద్రమౌళి, కేవీఎన్ ప్రసాద్, శిమ్మ చంద్రశేఖర్, అడపా చంద్రశేఖర్, పూతి రమణ, ఆనంద్, ఎం.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అలాగే నరసన్నపేట పట్టణంలోని ఇండోర్ స్టేడియం లో రూ.49 లక్షలతో చేపట్టనున్న ఉడెన్ గ్రౌండ్ పనులకు శంకుస్థాపన చేశారు.

## కొంటామంటూ నటించి...కొట్టేస్తారు!



**జగ్గంపేట, పతాకం న్యూస్:** బంగారం, వెండి షాపుల్లో వస్తువులు కొనుగోలు చేయడానికి వచ్చినట్టుగా నటించి చోరీలు చేస్తున్న ఐదుగురు మహిళలను జగ్గంపేట పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ వివరా లను సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ వెల్లడి ంచారు. పశ్చిమగోదావరి జిల్లాకు పాలకొల్లు మండలానికి చెందిన కావడి మహాలక్ష్మి, కావడి చిన్నదానమ్మ, కావడి పార్వతి, కావడి భవాని, చుక్కా నరస మ్మ, శ్యామల, రత్నం, రమ్య కలిసి ముఠాగా ఏర్పడి బంగారం షాపుల్లో వస్తువులు కొనుగోలు చేయడానికి వచ్చినట్టు నటించి చోరీలు చేస్తుం టారు. ఈ ముఠా ఈనెల 9న కాకినాడ జిల్లా జగ్గంపేట-గోకవరం రోడ్డులో తిరమల కాంప్లెక్స్ షాపు నెంబరు 2 శ్రీ కార్తికేయ జ్యువెలరీ షాపునకు వచ్చారు. 350 గ్రాముల బరువు గల 8 జతలు వెండి పట్టీలు దొంగిలించారు. తర్వాత షాపు యజమాని శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యా దుపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో మంగళవారం జగ్గంపేటలో కావడి మహాలక్ష్మి, కావడి చిన్న దానమ్మ, కావడి పా ర్వతి, కావడి భవాని, చుక్కా నరసమ్మను అరెస్ట్ చేశారు. శ్యామల, రత్నం, రమ్య పరారీలో ఉన్నా రు. కావడి మహాలక్ష్మిపై తిరుపతి జిల్లా వెంకటగిరి పీఎస్‌లో 4కేసులు, కోట పీఎస్‌లో ఒక కేసు ఉన్నాయి. కావిడి చిన్న దానమ్మ, కావడి పార్వతిలపై కాకినాడ సీపీఎస్‌లో ఒక కేసు, నరసాపురం టౌన్‌లో ఒక పాత కేసులు ఉన్నాయి. కావడి భవానిపై మొగల్తూరు పీఎస్‌లో ఒక కేసు, తణు కు టౌన్ పీఎస్‌లో ఒక కేసు ఉన్నాయి. వారి ను ంచి 350 గ్రాముల బరువు గల 8 జతలు వెండి పట్టీలు స్వాధీనంచేసుకున్నామని సీఐ తెలిపారు.

## కొవ్వూరు స్టేషన్‌కు అమృత్ భారత్



**కొవ్వూరు, పతాకం న్యూస్:** అమృత్ భారత్‌లో భాగంగా కొవ్వూరు రైల్వేస్టేషన్‌ను రూ.30 కోట్లతో అభివృద్ధి చేస్తామని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు. కొవ్వూరు రైల్వేస్టేషన్‌లో విశాఖపట్నం - కడప ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం - మచిలీపట్నం ఎక్స్ ప్రెస్ రైళ్లకు అప్, డౌన్ హాల్ట్ కల్పించారు. ఈ మేరకు విశాఖపట్నం- కడప ఎక్స్‌ప్రెస్ రైలుకు కొవ్వూరు రైల్వే స్టేషన్‌లో పచ్చజెండా ఊపి ప్రారంభించారు. కరోనా సమయంలో కొవ్వూరులో ఆగే రైళ్లను రద్దు చేశారన్నారు. కొవ్వూరు పరిసర ప్రాంతాల ప్రజలు కోరడంతో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విన్ వైష్టవ్‌ను కలిసి విన్నవించినట్టు పేర్కొన్నారు. ఈ మేరకు కొవ్వూరు రైల్వేస్టేషన్‌లో రెండు రైళ్లకు హాల్ట్ కల్పించారన్నారు. రానున్న రోజుల్లో మిగిలిన రైళ్ల హాల్ట్‌కు కృషి చేస్తానన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ కేంద్రం,రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ప్రజల అభీష్టం మేరకు సుపరిపాలన అందజేస్తుందన్నారు. జిల్లాలో ట్రాన్స్‌ఫోర్టు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై పూర్తి శ్రద్ధ పెట్టడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజల ఇబ్బందులను ఎంపీ పురందేశ్వరి దృష్టికి తీసుకెళ్లగా నాలుగు రైళ్ల నిలుపుదల చేస్తామని హామీ ఇచ్చారన్నారు. దానిలో భాగంగా ముందుగా తిరుమల, మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్‌లను నిలుపుదల చేయడంపై కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యుడు కంటమణి రామకృష్ణారావు, మునిసిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్, ఎంపీపీ కాకర్ల నారాయుడు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, పరిమి రాధ, కోడూరి లక్ష్మీనారాయణ, సూరపనేని చిన్ని తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాస్థాయి ఉపాధ్యాయుల క్రీడల్లో నర్సీపట్నం డివిజన్ ఘన విజయం



**నర్సీపట్నం, పతాకం న్యూస్:** జిల్లాస్థాయి ఉపాధ్యాయుల క్రీడా పోటీల్లో నర్సీపట్నం డివిజన్ జట్లు ఘన విజయాలు సాధించాయి. క్రికెట్ పోటీల్లో నర్సీపట్నం డివిజన్ తరఫున ఆడిన గొలుగొండ మండల టీమ్ విజయం సాధించగా, మహిళల త్రోబాల్ పోటీల్లో నర్సీపట్నం డివిజన్ మహిళా జట్టు ఫైనల్‌లో గెలుపొందింది. మంగళవారం నర్సీపట్నం బాలికల జూనియర్ కళాశాల మైదానంలో జరిగిన క్రికెట్ పోటీలో అనకాపల్లి డివిజన్ నుంచి బచ్చయ్యపేట మండలం, నర్సీపట్నం డివిజన్ నుంచి గొలుగొండ మండల జట్లు తలపడ్డాయి. ఉత్కంఠభరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో నర్సీపట్నం డివిజన్ జట్టు ఘన విజయం సాధించింది. అలాగే మహిళల త్రోబాల్ పోటీలో అనకాపల్లి డివిజన్ నుంచి రాంభిల్లి మండలం, నర్సీపట్నం డివిజన్ నుంచి నర్సీపట్నం మండల జట్లు తలపడి, ఫైనల్ మ్యాచ్‌లో నర్సీపట్నం జట్టు విజేతగా నిలిచింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా విద్యాశాఖ అధికారి జి. అప్పారావు నాయుడు మాట్లాడుతూ, విద్యార్థులకు నిత్యం పాఠాలు బోధించే ఉపాధ్యాయుల కోసం ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించడం సంతోషకరమన్నారు. విద్యార్థి దశలో ఆటల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు, ఇప్పటికీ అదే ఉత్సాహంతో ఆడటం అభినందనీయమన్నారు. తనకు కూడా క్రికెట్ అంటే ఎంతో ఇష్టమని తెలిపారు. రాబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టు విజయం సాధించాలని ఆకాంక్షించారు.

# కార్పొరేట్ కానుకలన్నీ బీజేపీకే!



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపికి గత ఆర్థిక సంవత్సరంలో కార్పొరేట్ శక్తుల నుంచి భారీ మొత్తంలో విరాళాలు అందాయి. అందులో 82 శాతం కార్పొరేట్ విరాళాలే ఉన్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గానూ రూ.6,654.93 కోట్లు ఆ పార్టీకి విరాళంగా అందాయి. లోక్‌సభ ఎన్నికలు జరిగిన గత ఏడాదితో పోలిస్తే ఆ పార్టీకి 68 శాతం విరాళాలు పెరిగినట్టు ఎన్నికల సంఘం రిపోర్టులో స్పష్టమైంది. డిసెంబర్ 8న కేంద్ర ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో నివేదికను పొందుపరిచారు. రూ.20 వేల కన్నా ఎక్కువ విరాళం అందుకున్న పార్టీ వివరాలు మాత్రమే ఆ వెబ్‌సైట్‌లో వెల్లడించారు. ఆ నివేదిక ప్రకారం 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 30 వరకు విరాళాలు అందాయని స్పష్టమైంది. ఈ సమయంలోనే దేశవ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికలతోపాటు అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, జమ్మూకాశ్మీర్, హర్యానా, జార?ండ్, మహారాష్ట్ర, ఢిల్లీ రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించారు. 2023-2024 ఆర్థిక సంవత్సరంలో బిజెపికి రూ.3,967 కోట్లు విరాళంగా అందాయి. ఈసారి మాత్రం ఆ విరాళాలు 68 శాతం పెరిగినట్టు రిపోర్టులో స్పష్టమైంది. బిజెపికి వచ్చిన విరాళాల్లో సుమారు 40 శాతం విరాళాలు ఎలక్టోరల్ ట్రస్టుల నుంచి వచ్చాయి. ప్రూడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్ రూ.2,180 కోట్ల విరాళం అందజేయగా, ప్రోగ్రెసివ్ ఎలక్టోరల్ ట్రస్ట్ రూ.757 కోట్లు, ఎబి జనరల్ ట్రస్ట్ రూ.606 కోట్లు, న్యూ డెమొక్రటిక్ ఎలక్టోరల్ ట్రస్టు రూ.150 కోట్లు డొనేట్ చేశాయి. ట్రయంఫ్ ఎలక్టోరల్ ట్రస్ట్ రూ.25 కోట్లు, జన ప్రగతి ఎలక్టోరల్ ట్రస్ట్ రూ.1.02 కోట్లు, జన్ కళ్యాణ్ ఎలక్టోరల్ ట్రస్ట్ రూ.19 లక్షలు, ఐంజిగార్డిగ్ ఎలక్టోరల్ ట్రస్ట్ రూ.7.75 లక్షలు విరాళంగా ఇచ్చాయి. ఇక ఇతర ట్రస్టుల నుంచి సుమారు రూ.3,112.50 కోట్లు బిజెపికి విరాళంగా వచ్చాయి. మిగిలిన విరాళాలు కంపెనీలు, వ్యక్తుల నుంచి వచ్చాయి. కంపెనీలు, వ్యక్తుల నుంచి వచ్చిన విరాళాలను రాజకీయ పార్టీలకు పంపిణీ చేయడానికి కంపెనీలు ఒక ఎలక్టోరల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేస్తాయి. బిజెపికి అందిన మొత్తం విరాళాల్లో 82 శాతం కార్పొరేట్ సంస్థల నుంచే అందాయి. విరాళాలు ఇవ్వటంలో అగ్రస్థానంలో ఉన్న ప్రూడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్ భారతీ ఎయిర్‌టెల్ మాతృ సంస్థ భారతీ ఎంటర్ ప్రైజెస్ ఆధీనంలో ఉంది. ప్రూడెంట్‌కు విరాళాలు ఎల్ అండ్ టి తరువాత మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్షర్స్, దాని ప్రమోటర్ పివి కృష్ణారెడ్డి నుంచి అత్యధిక మొత్తంలో అందాయి. దీని మొత్తం రూ.320 కోట్లు. ఈ సంస్థ 2018-2024 మధ్య ఎన్నికల బాండ్లను ఉపయో గించి బిజెపికి అత్యధిక విరాళం అందించింది. లాటరీ వ్యాపారి శాంటియాగో మార్టిన్ సంస్థ టైగర్ అసోసియేట్స్ ప్రూడెంట్‌కు రూ.147 కోట్లు విరాళంగా ఇచ్చింది. ఆర్‌పి సంజీవ్ గోయెంకా గ్రూపు సంస్థలు ప్రూడెంట్‌కు రూ.144 కోట్లు విరాళంగా ఇచ్చాయి. ఇండిగో ఎయిర్‌లైన్స్ మాతృ సంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ లిమిటెడ్ ట్రస్ట్‌కు రూ.40 కోట్లు విరాళంగా ఇచ్చింది. ఇండిగో ఉమ్మడి డైరెక్టర్లకు సంబంధించిన అశోక్ లేలాండ్, అపోలో టైర్స్ కూడా ట్రస్ట్‌కు రూ.150 కోట్లు విరాళంగా ఇచ్చాయి. అశోక్ లేలాండ్ హిందూజా గ్రూపులో భాగం. ఈ గ్రూప్ సంస్థ కలిసి ప్రూడెంట్‌కు రూ.177.5 కోట్లు విరాళంగా ఇచ్చింది. ఇతర ప్రధాన దాతల్లో ఒపి జిందాల్ గ్రూపులోని నవీన్ జిందాల్ వర్గానికి సంబంధించిన సంస్థలు ఉన్నాయి. ఈ సంస్థలు ట్రస్ట్‌కు రూ. 107 కోట్లు విరాళంగా ఇచ్చాయి. డిఎల్‌ఎఫ్ గ్రూప్ రూ.100 కోట్లు, టోరెంట్ ఫార్మాస్యూటికల్స్ రూ. 98.5 కోట్లు విరాళంగా ఇచ్చాయి. భారతీ ఎయిర్‌టెల్, అరబిందో ఫార్మా తదితర సంస్థలు కూడా కోట్ల రూపాయల్లో విరాళాలు ఇచ్చాయి. రెండోది టాటా గ్రూప్ నియంత్రణలోని ప్రోగ్రెసివ్ ఎలక్టోరల్ ట్రస్ట్. ఇది మోడీ ప్రభుత్వం నుంచి లాభదాయకమైన సబ్సిడీలతో సెమీకండక్టర్ ప్రాజెక్టులను పొందిన వారాల తరువాత బిజెపికి పెద్ద మొత్తంలో విరాళాలు అందజేసింది. ఎలక్టోరల్ ట్రస్టులలో మూడో అతిపెద్ద విరాళం ఇచ్చేది ఎబి జనరల్ ట్రస్ట్. ఇది ఆదిత్య బిర్లా గ్రూప్ నియంత్రణలో ఉంది. నాలుగో అతిపెద్ద విరాళం ఇచ్చే న్యూ డెమొక్రటిక్ ఎలక్టోరల్ ట్రస్ట్.. మహీంద్రా గ్రూప్ ఆధీనంలో ఉంది. ఐదో అతిపెద్ద విరాళం ఇచ్చే ట్రయంఫ్ ఎలక్టోరల్ ట్రస్ట్ సిజి పవర్ అండ్ ఇండిస్టియల్ సొల్యూషన్స్ లిమిటెడ్ నియంత్రణలో ఉంది. సీరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా సుమారు రూ.వంద కోట్లు విరాళం ఇచ్చింది. రుంగ్తా సన్స్ ప్రైవేటు లిమిటెడ్ రూ. 95 కోట్లు, బజాజ్ గ్రూపు కంపెనీలు రూ.74 కోట్లు, వేదాంత రూ.67 కోట్లు, మాక్రోటెక్ డెవలపర్స్ (ఇప్పుడు లోధా డెవలపర్స్ అని పేరు మార్చబడింది) రూ.65 కోట్లు, డెరైవ్ ఇన్వెస్టిమెంట్స్ సుమారు రూ.53 కోట్లు, మోడరన్ రోడ్ మేకర్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.52 కోట్లు, లోటస్ హోమ్ టెక్స్‌టైల్స్ లిమిటెడ్ రూ.51 కోట్లు, సఫల్ గోయల్ రియాల్టీ ఎల్‌ఎల్‌పి రూ.45 కోట్లు, ఐటీసీ లిమిటెడ్ రూ.39 కోట్లు, గ్లోబల్ ఐవి వెంచర్స్ ఎల్‌ఎల్‌పీ రూ.35 కోట్లు విరాళంగా ఇచ్చాయి. హీరో ఎంటర్‌ప్రైజెస్ పార్టనర్ వెంచర్స్, మ్యాన్‌కైండ్ ఫార్మా లిమిటెడ్, సురేశ్ అమృత్‌లాల్ కోటక్ ఒక్కొక్కటి రూ.30 కోట్ల చొప్పున విరాళాలు ఇచ్చాయి. దిలీప్ బిల్డ్‌ఐకాన్ గ్రూపు రూ.29 కోట్లు, హిందుస్తాన్ జింక్ ప్రయివేట్ లిమిటెడ్ రూ.27 కోట్లు, మలబార్ గోల్డ్ రూ.10 కోట్లు, కళ్యాణ్ జ్యూయలర్స్ రూ.15.1 కోట్లు, వేవ్ ఇండిస్టీస్ రూ.5.25 కోట్లు, జిరోదా ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ రూ.1.5 కోట్లు విరాళం అందజేశాయి. బిజెపి నేతలు కూడా ఆ పార్టీకి విరాళాలు అందజేశారు. అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ రూ.3 లక్షలు, మంత్రి పీయూష్ హజారి రూ.2.75 లక్షలు, కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రదాన్ రూ.లక్ష, ఒడిశా సీఎం మోహన్ చరన్ మాంజీ రూ.5 లక్షలు, ఇండోర్ మేయర్ భార్గవ రూ.లక్ష, ఆకాశ్ విజయ వర్గియా రూ.లక్ష విరాళాలు అందజేశారు. బిజెపికి భారీగా విరాళాలు పెరగగా, ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీకి మాత్రం భారీగా విరాళాలు తగ్గాయి. ఆ పార్టీకి రూ.522.13 కోట్లు మాత్రమే విరాళాల రూపంలో వచ్చాయి. 2023-24లో ఆ పార్టీకి రూ.1,129 కోట్లు విరాళాలు అందాయి. గతేడాది కంటే 43 శాతం తక్కువగా విరాళాలు అందాయి. పశ్చిమ బెంగాల్‌లోని అధికార తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) పార్టీకి విరాళాలు గతేడాది రూ.618.8 కోట్ల నుంచి రూ.184.08 కోట్లకు తగ్గాయి. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)కు గతేడాది రూ.22.1 కోట్ల విరాళాలు రాగా, ఈసారి రూ.39.2 కోట్లకు పెరిగాయి. ఒడిశాలో అధికారాన్ని కోల్పోయి ప్రధాన ప్రతిపక్షంగా మారిన బిజు జనతాదళ్ (బిజెడి)కి ఈ ఏడాది రూ.60 కోట్లు మాత్రమే విరాళాలు వచ్చాయి. గత ఆర్థిక సంవత్సరంలో రూ.246 కోట్లు వచ్చాయి. తమిళనాడులోని అధికార డిఎంకె రూ.365 కోట్ల విరాళాలు పొందింది. బీహార్ సీఎం నితీశ్ కుమార్ నేతృత్వంలోని జెడి (యు) రూ.18 కోట్లు, ఎల్‌జెపి రూ.11 కోట్లు, శిరోమణి అకాలీదళ్ (ఎస్‌ఎడి) రూ.4 కోట్లు, ఎస్‌పి రూ.93 లక్షలు, ఎంఎన్‌ఎస్ రూ.90.87 లక్షల విరాళాలు పొందాయి. తెలుగు రాష్ట్రాల్లోని ప్రాంతీయ పార్టీలకు అందిన విరాళాల్లో వైఎస్‌ఆర్ కాంగ్రెస్‌కు రూ.140 కోట్లు అందాయి. ఆ తర్వాతి స్థానంలో తెలుగుదేశం పార్టీ రూ.85.2 కోట్ల విరాళాలను అందుకుంది. ఫీజులు, చందాల ద్వారా రూ.102 కోట్లు సేకరించింది. ఇక జనసేనకు రూ.25 కోట్లు వచ్చాయి. తెలంగాణలోని ప్రధాన ప్రతిపక్షం భారత రాష్ట్ర సమితి (బిఆర్‌ఎస్)కి రూ.15.09 కోట్లు వచ్చాయి. ఇదే పార్టీకి గతేడాది రూ.580 కోట్లు వచ్చాయి.

**ఆరేళ్లలో బిజెపి పొందిన విరాళాలు**

| సంవత్సరం | విరాళాలు (కోట్లల్లో) |
|---|---|
| 2019-20 | రూ.3,427 |
| 2020-21 | రూ.578 |
| 2021-22 | రూ.1,775 |
| 2022-23 | రూ.2,120 |
| 2023-24 | రూ.3,967 |
| 2024-25 | రూ.6,088 |
| మొత్తం | రూ.17,955 |

# ఇనుమూరు గిరిజనులపై దౌర్జన్యకాండ



**ఏలూరు, పతాకం న్యూస్:** ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండలం ఇనుమూరు గ్రామ గిరిజనులపై పోలీసులు, రెవెన్యూ అధికారులు రెచ్చిపోయారు. ఏజెన్సీలో మారుమూల గ్రామం అడిగేవారు ఉండరన్న ధైర్యంతో విధ్వంసకాండ సాగించారు. గిరిజనులు సాగు చేసుకుంటున్న మొక్కజొన్న పంటను తహశీల్దార్ పివి.చలపతిరావు ఆధ్వర్యంలో పోలీసులు, రెవెన్యూ అధికారులు ధ్వంసం చేశారు. ట్రాక్టర్‌తో దున్నించేశారు. అడ్డుకున్న వారిపై దౌర్జన్యకాండకు పాల్పడ్డారు. మహిళలు, వృద్ధులు అనే తేడా లేకుండా రక్తం వచ్చేటట్లు లాఠీలతో పోలీసులు చావచితకబాదారు. గిరిజన మహిళలపై మగ పోలీసులు విచక్షణారహితంగా దాడి చేశారు. గిరిజన యువకుడు చంద్రశేఖర్ రక్తం కారుతున్నా తమ పంటను నాశనం చేయవద్దంటూ వేడుకున్నా పోలీసులు, రెవెన్యూ అధికారులు కర్కశంగా వ్యవహరించారు. గిరిజనుల ఆర్తనాదాలు మారుమూల కొండల్లో మార్మోగాయి. బాధిత గిరిజనుల కథనం ప్రకారం ఇనుమూరు గ్రామంలో 57 ఎస్‌టి కుటుంబాలు ఉన్నాయి. ఈ కుటుంబాలకు వ్యవసాయమే జీవనాధారం. బుట్టాయగూడెం మండలం అంతర్వేదిగూడెం శివారు ఇనుమూరు గ్రామ రెవెన్యూ పరిధి సర్వే నెంబర్ 221లో 3.34 ఎకరాలు, 223లో 8.74 ఎకరాలు, 210లో 6.67 ఎకరాలు, 217లో 7.52 ఎకరాలు, 213లో 9.50 ఎకరాలు, 214లో ఏడు ఎకరాలు ప్రభుత్వ భూములు ఉన్నాయి. ఈ భూములను గ్రామ గిరిజనుల పూర్వీకులు చదును చేసి సాగులోకి తెచ్చారు. తరతరాలుగా తాతదండ్రుల నుండి సాగు చేసుకుంటున్న ఈ భూముల్లో బొబ్బర, మినుము, మొక్కజొన్న సాగు చేసుకుని జీవనోపాధి పొందుతున్నారు. ఈ భూములను తమకు అసైన్‌మెంట్ చేయాలని కోరుతూ రెవెన్యూ అధికారులకు అనేకసార్లు దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేకుండాపోయింది. పైగా గిరిజనేతర భూస్వాములకు అనుకూలంగా పోలీసులు, మండల రెవెన్యూ అధికారులు వ్యవహరించారు. గిరిజనులు పండిస్తున్న మొక్కజొన్న పంటను ట్రాక్టర్‌తో బలవంతంగా దున్నించేశారు. దీనిని అడ్డుకున్న గిరిజనులపై పోలీసులు, రెవెన్యూ అధికారులు విచక్షణారహితంగా దాడి చేసి కొట్టారు. గిరిజన మహిళలపై మగ పోలీసులు దాడికి పాల్పడ్డారు. ఈ భూముల సమస్యపై ఇప్పటికే హైకోర్టులో కేసు ఉంది. అయినప్పటికీ అధికారులు ప్రొటెక్షన్ ఆర్డర్ ఏ విధంగా ఇచ్చారో చెప్పాలని గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. ఇనుమూరు గ్రామంలో గిరిజనుల మొక్కజొన్న పంటను ధ్వంసం చేసి, గిరిజనులపైనా, గిరిజన మహిళలపైనా దాడి చేసిన పోలీసులు, రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు మెయిల్ ద్వారా కలెక్టర్‌కు పంపించిన వినతిపత్రంలో పలు వివరాలు పేర్కొన్నారు. గ్రామంలో గిరిజనులు ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న భూములు అక్కడి వారికే చెందుతాయని తెలిపారు. దీనిపై ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# నడుం నొప్పికి కారణం ఏమిటి?

మనం ఎక్కువగా ఎదుర్కొనే ఇబ్బందుల్లో నడుం నొప్పి ఒకటి. ప్రతి ఒకరు ఎప్పుడో అప్పుడు దీని వల్ల బాధపడి ఉంటారు. అయితే, అన్నిసార్లూ ఇది వెన్నెముక సమస్యే కాకపోవచ్చు. ముఖ్యంగా ఒబెసిటీ, డయాబెటిస్ గలవారు నడుం నొప్పితో ఇబ్బంది పడుతుంటే ఒకింత సునిశితంగా గమనించాల్సిందే. ప్రత్యేకించి కూర్చున్నప్పుడు నొప్పి తగ్గటం, నడవటం మొదలెట్టగానే నొప్పి తలెత్తటం, నడక అలాగే కొనసాగిస్తే నొప్పి తీవ్రమవుతుంది. ఆ వెంటనే నడక ఆపితే నొప్పి తగ్గటం, కాసేపటికి నొప్పి పూర్తిగా మాయమవుతున్నట్టయితే మరేదో కారణమవుతుండొచ్చు. చాలామంది దీన్ని దిగువ వెన్నెముక నొప్పి, సయాటికాగా పొరపడుతుంటారు. దీంతో కొంతమంది క్యాల్షియం, నొప్పి నివారణ మాత్రలు వేసుకుంటుంటారు. మరికొందరు ప్రత్యేక వ్యాయామాలూ చేస్తుంటారు. అయినా, ఫలితం కనిపించదు. సమస్య ఒకటి, చికిత్స మరోటి అయితే ఏం ప్రయోజనముంటుందని నిపుణులు అంటున్నారు. ఎందుకంటే, నడుం నొప్పి వివిధ కారణాల వస్తుందని చెబుతున్నారు. ఇంతకీ నడుం నొప్పి కారణమేంటో ఇప్పుడు తెలుసుకుందాం! ఎవరికైనా నడుం నొప్పి వచ్చిందంటే మాములుగా రెండు కారణాలు కనిపిస్తుంటాయి. ఒకటి- దీర్ఘకాల నడుం నొప్పి. ఇది చాలా వరకూ కింద పడటం వల్ల వస్తుంది. రెండు- ఒబెసిటీ, అధిక బరువు. దీనికి కారణం శారీరక శ్రమ, వ్యాయామం తగ్గిపోవడం. రోజులో ఎక్కువసేపు కూర్చునే వారిలో వెన్నెముక కదలటం తగ్గుతుందంటున్నారు నిపుణులు. క్రమంగా పూసలు బిగుసుకోవటం మొదలెడతాయని, దీంతో వెన్నెముక సాఫీగా సాగదని చెబుతున్నారు. ఇలాంటివారు పనులు చేయటం మొదలెట్టగానే నొప్పితో విలవిల్లాడుతుంటారని పేర్కొంటున్నారు. దీనికి భిన్నమైంది లంబార్ యాంజైనా అని చెబుతున్నారు. ఇందులో నడుస్తున్నప్పుడు నడుం, తొడ నొప్పి మొదలవుతుందంటున్నారు నిపుణులు. వెన్నుపూసలు బిగుసుకోవటంతో దీనికి సంబంధం లేదని చెబుతున్నారు. ఇది నడుం, తొడ భాగాలకు మంచి రక్తం సరఫరా తగ్గటం వల్ల వస్తుందని పేర్కొంటున్నారు. ఎవరైనా కూర్చున్నప్పుడు నడుం నొప్పితో బాధపడుతుంటే లంబార్ యాంజైనా కారణంగా వస్తుందని తెలియజేస్తున్నారు. ముఖ్యంగా డయాబెటిస్, పొగతాగేవారిలో దీన్ని చూస్తుంటామని వివరిస్తున్నారు. రక్త సరఫరా తగ్గటం వల్ల వచ్చే నొప్పిని వైద్యపరిభాషలో యాంజైనా అంటారు. గుండె కండరానికి రక్తం సరఫరా తగ్గితే గుండెపోటు వచ్చినట్టుగానే నడుం వద్ద కండరాలకు, తుంటి అవయవాలకు రక్తం తగినంత అందకపోతే లంబార్ యాంజైనాకు దారితీస్తుందని హెచ్చరిస్తున్నారు. దీన్ని నిర్లక్ష్యం చేస్తే పాదాలకు రక్తసరఫరా తగ్గి, కుళ్లిపోయే (గ్యాంగ్రీన్) ముప్పు పెరుగుతుందని వెల్లడిస్తున్నారు. గుండె నుంచి వచ్చే పెద్ద రక్తనాళం కడుపు గుండా సాగుతూ నడుం కింది భాగానికి వెళ్తుందంటున్నారు నిపుణులు. ఇది నడుం దిగువ కండరాలకు, తుంటి అవయవాలకు రక్తాన్ని సరఫరా చేస్తుందని చెబుతున్నారు. ఈ రక్తనాళం రెండుగా చీలి కుడి, ఎడమ తొడలకు రక్తాన్ని తీసుకెళ్తుందని తెలియజేస్తున్నారు. అక్కడి నుంచి మరింత కిందికి సాగి కాళ్లకు, పాదాలకు రక్తం సరఫరా చేస్తుందని పేర్కొంటున్నారు. వ్యాయామం చేయకపోవటం, రక్తంలో గ్లూకోజు అదుపులో లేకపోవటం వల్ల రక్తనాళాల్లో త్వరగా కొవ్వు పేరుకుపోతుందంటున్నారు. దీంతో లోపలి మార్గం సన్నబడుతుందని తెలియజేస్తున్నారు. పొగ తాగేవారు, డయాబెటిస్ పేషెంట్స్?లో ఇది మరింత ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు. దీంతో నడుం, తొడ భాగాలకు మంచి రక్తం అందటం తగ్గుతుందని తెలియజేస్తున్నారు. ఫలితంగా, నడుస్తున్నప్పుడు నడుం నొప్పి తలెత్తుతుందని పేర్కొంటున్నారు.



నడుం నొప్పి అనగానే డాక్టర్ సలహా తీసుకోకుండానే మన దగ్గర ఉన్న నొప్పి మాత్రలు వేసుకుంటాం. ఒక మాత్ర పనిచేయకపోతే మరో మాత్ర వాడుతుంటాం. ఇలా వారాలు, నెలల కొద్దీ మారుస్తుంటాం. ఇలా చేయడం ఆరోగ్యానికి అంత మంచిది కాదు. నడుం నొప్పి కారణం తెలుసుకోకుండా నొప్పి మాత్రలు వాడటం చాలా హానికరం. నడుం, తొడ భాగాలకు సరిగా రక్తం అందకపోవటం వల్ల వచ్చే నొప్పికి సరైన చికిత్స తీసుకోకపోతే భవిష్యత్తులో కాళ్లను కోల్పోయే ప్రమాదం ఉంది. అదే పనిగా నొప్పి మాత్రలు వాడితే కిడ్నీలూ దెబ్బతినొచ్చు. చివరికి కిడ్నీ వైఫల్యమూ సంభవించొచ్చు వైద్యులు తెలియజేస్తున్నారు. నడుం నొప్పిని నిర్లక్ష్యం చేస్తే రెండు రకాలుగా హాని కలుగుతుందంటున్నారు నిపుణులు. మగవారిలో అంగానికి రక్త సరఫరా సరిగా జరగకపోతే స్తంభన లోపం, శృంగారాన్ని ఆస్వాదించలేకపోవటానికి దారితీస్తుందని చెబుతున్నారు. అలాగే, కాళ్లకు మంచి రక్తం అందటం తగ్గుతూ వస్తుందని తెలియజేస్తున్నారు. ఫలితంగా, కాళ్లలో తీవ్రమైన నొప్పి, చర్మం నల్లబడటం మొదలవుతుందని పేర్కొంటున్నారు. పాదాలు, కాళ్లు కుళ్లిపోవటమూ ఆరంభమవుతుందని, అప్పుడు వాటిని శస్త్రచికిత్స చేసి తొలగించటం తప్ప మరో మార్గముండదని వెల్లడిస్తున్నారు. డయాబెటిస్ గలవారికి పొగ తాగటం లేదా తరచూ జర్దా, గుట్కా వంటి పొగాకు ఉత్పత్తులు తినే అలవాటు కూడా ఉన్నట్టయితే కాళ్లకు అంత మంచిది కాదంటున్నారు నిపుణులు. దీర్ఘకాలంగా డయాబెటిస్ గలవారికి రక్తనాళాలు దెబ్బతినే ముప్పు ఎక్కువగా ఉంటుందని హెచ్చరిస్తున్నారు. దీనికి పొగాకు తోడైతే అగ్నికి ఆజ్యం పోసినట్లే అవుతుందని వివరిస్తున్నారు. కాళ్లు, పాదాలకు రక్తం అందటం మరింత తగ్గుతుంది త్వరగా గ్యాంగ్రీన్ ముంచుకొస్తుందని పేర్కొంటున్నారు. పొగతాగే అలవాటు గల మధుమేహులకు చికిత్స చేసినా ఫలితం అంతగా ఉండకపోవచ్చని తెలియజేస్తున్నారు. నడుం నొప్పితో బాధపడేవారు, ముఖ్యంగా, డయాబెటిస్, పొగతాగే అలవాటు గలవారు నిర్లక్ష్యం చేయొద్దంటున్నారు నిపుణులు. అధునాతన డాప్లర్ స్టడీస్, సీటీ యాంజియోగ్రఫీ పరీక్షల సదుపాయాలున్న ఆసుపత్రికి వెళ్లి, కారణాన్ని తెలుసుకోవాలని సూచిస్తున్నారు. రక్తనాళాలకు లేదా గుండె రక్తనాళాలకు చికిత్స చేసే నిపుణులను సంప్రదించాలని సలహా ఇస్తున్నారు. నడుం నొప్పి కారణాన్ని నిర్ధారించటానికిది తప్పనిసరంటున్నారు.

# అందానికి బాదం నూనె - ఇలా వాడితే జుట్టు సమస్యలు పోతాయట!

ఆరోగ్యానికి బాదం పప్పు ఎంతో మేలు చేస్తుంది. అయితే, బాదం నుంచి తయారుచేసే నూనెలో కూడా ఎన్నో మంచి గుణాలు ఉన్నాయని, అవి అందానికి మేలు చేస్తాయని నిపుణులు చెబుతున్నారు. ఇందులోని పోషకాలు, విటమిన్లు చర్మ సమస్యల్ని దూరం చేయడంలో సమర్థంగా పనిచేస్తాయంటున్నారు. మరి, బాదం నూనె వల్ల కలిగే ప్రయోజనాలేంటో ఇప్పుడు తెలుసుకుందాం!

కుదుళ్లకు మసాజ్‌గా : ప్రస్తుతం పర్యావరణ కాలుష్యం వల్ల ధూళి, దుమ్ము వంటివి జుట్టును ఇబ్బంది పెడుతున్నాయి. పొడిబారడం, చివర్లు చిట్లడం లాంటి సమస్యలు చాలా మందిని కలవర పెడుతున్నాయి. ఇలాంటప్పుడు బాదం, ఆముదం, ఆలివ్ నూనెల్ని సమపాళ్లలో తీసుకొని, ఈ మిశ్రమంతో కుదుళ్లను మర్దనా చేసుకోవాలని చెబుతున్నారు. ఇలా వారంలో కనీసం రెండు సార్లు చేస్తే జుట్టు ఆరోగ్యంగా ఉండటంతోపాటు ఒత్తుగా పెరుగుతుందని సూచిస్తున్నారు. అలాగే స్నానం చేయడానికి ముందు శరీరానికి బాదం నూనె రాసుకొని బాగా మర్దనా చేసుకోవాలని, తద్వారా ఇందులోని పోషకాలు చర్మానికి తేమను అందిస్తాయని చెబుతున్నారు.

బాదం నూనెలో మోనోఅన్‌శాచురేటెడ్ ఫ్యాటీ యాసిడ్స్ అధికంగా ఉంటాయని, ఇవి రేడియేషన్ కిరణాల నుంచి జుట్టుకు రక్షణ కల్పిస్తాయని అధ్యయనం పేర్కొంది. క్యూటికల్ కణాల మధ్య అంతరాన్ని పూరించడం వల్ల జుట్టు స్థితిస్థాపకత పెరుగుతుందని వెల్లడించింది.

నీరు తక్కువగా తాగడం, నిద్ర లేకపోవడం వల్ల కళ్ల కింద నల్లటి వలయాలు వస్తాయి. ఈ సమస్యతో ఇబ్బంది పడేవారు రాత్రి పడుకునే ముందు కొన్ని చుక్కల బాదం నూనెను కళ్ల కింద అప్లై చేసుకొని, కాసేపు మృదువుగా మర్దనా చేసుకోవాలని సూచిస్తున్నారు. దీనివల్ల కళ్ల కింద నల్లటి వలయాలు తగ్గే అవకాశం ఉందని చెబుతున్నారు.

యాంటీ ఏజింగ్ : చిన్న వయసులోనే ముఖంపై ముడతలు, గీతలతో కొంతమంది ఇబ్బంది పడుతుంటారు. ఇలాంటి వారికి బాదం నూనె మేలు చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఇందులోని పోషకాలు యాంటీ ఏజింగ్ కారకాలుగా పనిచేస్తాయని అంటున్నారు. దీన్ని తరచూ చర్మానికి రాసుకోవడం వల్ల వృద్ధాప్య ఛాయలు తగ్గుముఖం పడతాయని వివరిస్తున్నారు.

బాదం నూనెలో ఎమోలియెంట్, స్క్లెరోసెంట్ లక్షణాలు ఉన్నాయని, ఇవి చర్మాన్ని మృదువుగా చేయడంతోపాటు చర్మపు రంగును మెరుగుపరుస్తాయని %జుబతీశీజూవ ్రావీజ% అధ్యయనం పేర్కొంది. అంతేకాకుండా సోరియాసిస్, తామర వంటి పొడి చర్మ పరిస్థితులకు చికిత్స చేయడానికి బాదం నూనెను ఉపయోగించేవారని వెల్లడించింది. ఇంకా, శస్త్రచికిత్స తర్వాత వచ్చే మచ్చలను బాదం నూనె తగ్గిస్తుందని పేర్కొంది.

గాలిలోని దుమ్ము, ధూళి వంటివి చర్మాన్ని నిర్జీవంగా మారుస్తాయి. అందువల్ల రెండు చెంచాల పెసరపిండిలో సరిపడా బాదం నూనె (%ూశ్రీఎశీఅస ాఱశ్రీ%) కలుపుకొని పేస్ట్?లా చేసుకోవాలని, దీన్ని చర్మానికి నలుగులా పెట్టుకుంటే మృతకణాలు తొలగిపోయి చర్మం తాజాగా మారుతుందని చెబుతున్నారు. అంతేకాకుండా పొడిబారి గరుకుగా మారిన చర్మానికి, పగిలిన మడమలకూ ఈ నూనె పట్టించి బాగా మర్దన చేస్తే, ఫలితం ఉంటుందని చెబుతున్నారు.



# కొత్త విధానంతో తగ్గిన జీఎస్టీ వసూళ్లు



**అమరావతి, పతాకం న్యూస్:** కొత్త జిఎస్టి విధానం రాష్ట్ర ఖజానాపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. సెప్టెంబర్ లో ఈ విధానం అమలులోకి వచ్చినప్పటికీ, పూర్తి స్థాయి ప్రభావం నవంబర్ లో కనిపించింది. అక్టోబర్ కన్నా నవంబర్ లో నాలుగు శాతానికన్నా ఎక్కువగా ఆదాయం తగ్గినట్లు తేలింది. నూతన జిఎస్టి విధానాన్ని అమలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు తగ్గుతున్న ఆదాయానికి ప్రత్యామ్నాయం చూపలేదు. దీంతో రాష్ట్ర ప్రభుత్వంలో ముఖ్యంగా ఆర్థికశాఖ వర్గాల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. 'ఆదాయం తగ్గుతున్న విషయం కేంద్ర ప్రభుత్వ దృష్టిలో ఉంది. కేంద్ర ఆర్థికశాఖకు దీనికి సంబంధించిన సమాచారం పంపాం.' అని ఒక ఉన్నతాధికారి చెప్పారు. నూతన విధానం అమలులోకి వచ్చిన మొదటి నెలలోనే ఆదాయం భారీ స్థాయిలో తగ్గడంతో కేంద్ర ఆర్థికశాఖ దృష్టికి ఆ విషయాన్ని తీసుకువెళ్లినట్లు సమాచారం. గత ఏడాది ఆ సమాయానికి ఉన్న ఆదాయం, నూతన విధానంతో తగ్గిన ఆదాయం, ఇదే పరిస్థితి కొనసాగితే రాష్ట్ర ఖజానా పరిస్థితి తదితర అంశాలను వివరిస్తూ కేంద్ర ఆర్థికశాఖకు పూర్తి సమాచారం పంపినట్లు తెలిసింది. అయితే, ఈ సమాచారం అంది నెలలు గడుస్తున్నా కేంద్ర ప్రభుత్వం నుండి అధికారుల్లో ఎటువంటి స్పందన రాకపోవడం చర్చనీయాంశమైంది. దీంతో రాష్ట్ర స్థాయిలోనే ప్రత్యామ్నాయం కోసం వెదుకుతున్నారు. అక్టోబర్ కన్నా నవంబర్ లో ఆదాయం తగ్గడం కనిపించింది. గత ఏడాది అక్టోబర్ లో 2,777 కోట్లు ఆదాయం రాగా, నవంబర్ లో 2,827 కోట్లు వచ్చింది. ఈ ఏడాది అక్టోబర్ లో 3,021 కోట్లు రాగా, నవంబర్ లో కేవలం 2,697 కోట్లు మాత్రమే రావడం గమనార్హం. ఇది 4.60 శాతం తక్కువగా ఉన్నట్లు తేల్చారు ఏడాదికి ఎనిమిది వేల కోట్ల రూపాయలు తగ్గే అవకాశం ఉందని అధికారులు గతంలో అంచనా వేశారు. అయితే, తాజా తగ్గుదలను పరిగణలోకి తీసుకుంటే అంతకన్నా ఎక్కువగా ఉంటుందని భావిస్తున్నారు. పన్నుల వసూళ్లలో ఇప్పటికే నెలకొన్న లీకేజిల సమస్య ఖజానాకు భారంగా మారుతోందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పన్నుల ఎగవేత కూడా మరో సమస్యగా ఉందని వారంటున్నారు. ఇప్పుడు జిఎస్ స్లాబ్లుల మార్పు కూడా కొత్త సమస్యకు తెరలేపుతోందన్న భావన వారు వ్యక్తం చేస్తున్నారు. అందుకే జిఎస్టి నష్టాన్ని అధిగమించేందుకు కొత్త మార్గాలనుఎ అన్వేషించాలని యోచిస్తున్నారు. ప్రధానంగా లీకేజిల నివారణ, పాత బకాయిల వసూళ్లపైనే ఎక్కువగా దృష్టి సారించాలని భావిస్తున్నట్లు ఆర్థికశాఖ అధికారి ఒకరు వ్యాఖ్యానించడం గమనార్హం.

# ఆరావళిని రక్షించుకుందాం



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ప్రకృతి నిర్మించిన రక్షణ కవచం ఆరావళి పర్వత శ్రేణులను చట్టబద్ధంగా అస్మదీయ మైనింగ్, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు దోచిపెట్టేందుకు కేంద్రం రంగం సిద్ధం చేస్తుండటం ఆందోళనకరం. వందల కోట్ల సంవత్సరాల క్రితం ఆవిర్భవించిన ప్రపంచంలోనే అతి పురాతన మడత పర్వత శ్రేణుల్లో ఒకటైన వీటిని ఇటీవల కేంద్రం కొత్తగా నిర్వచించడం కార్పొరేట్ శక్తుల కోసమేనన్నది బహిరంగ రహస్యం. దానికి సుప్రీంకోర్టు ఆమోదం తెలపడం పర్యావరణానికి, జీవ కారుణ్యానికే కాదు%ొ% మానవ మనుగడకే ప్రమాదకరం. సామాజిక మాధ్యమ వేదికల్లో ఉత్తరాదిన ప్రారంభమైన 'సేవ్ ఆరావళి క్యాంపెయిన్' రోజురోజుకూ దేశవ్యాప్తంగా విస్తరిస్తోంది. ఉత్తర భారతానికి గ్రీన్ లంగ్స్ (పచ్చని ఊపిరితిత్తులు)గా ఉన్న ఆరావళిని కాపాడాలన్న హ్యాష్ ట్యాగ్‌లతో విద్యావంతులు, మేధావులు, పర్యావరణ వేత్తలు, నిపుణులు ముక్తకంఠంతో నినదిస్తున్నారు. అక్రమ మైనింగ్‌ను ఎలా చట్టబద్ధం చేస్తారని కేంద్రాన్ని నిలదీస్తున్నారు. వంద మీటర్లు.. అంటే 328 అడుగుల కంటే ఎక్కువ ఎత్తున్న వాటినే పర్వతాలుగా పరిగణిస్తామని, 500 మీటర్ల పరిధిలో ఉండే పర్వత సమూహాలనే ఆరావళి పర్వత శ్రేణిగా గుర్తిస్తామని కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ ప్రామాణికాలు నిర్దేశించింది. అంతకంటే తక్కువ ఎత్తుంటే పర్వతాలుగా పరిగణించబోమన్న కేంద్రం వాదనను సుప్రీంకోర్టు ఆమోదించింది. అటవీ, జల, ఖనిజ ఇతర సహజ వనరులను అందిస్తూ.. నాలుగు రాష్ట్రాల సామాజిక, ఆర్థిక ప్రగతికి దోహదపడుతున్న ఆరావళిలోని 90 శాతం ప్రాంతాలకు మైనింగ్, రియల్ ఎస్టేట్ ముప్పు పొంచి వుంది. దేశ రాజధాని ఢిల్లీతోపాటు హర్యానా, రాజస్థాన్, గుజరాత్ వరకూ దాదాపు 700 కిలోమీటర్ల మేర విస్తరించివున్న ఈ పర్వత శ్రేణి థార్ ఎడారి నుంచి వచ్చే ఇసుక, ధూళిని అడ్డుకోవడంలో కీలకమైనవని ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఐ) నివేదిక స్పష్టం చేస్తోంది.

'పీపుల్ ఫర్ ఆరావలీస్' సంస్థ ఇచ్చిన నివేదిక ప్రకారం అనూహ్యంగా పెరిగిన పట్టణీకరణ, ఖనిజాన్వేషణలతో అడవుల్లో ముమ్మరంగా సాగుతున్న తవ్వకాలు, నివాస ప్రాంతాల విస్తరణ వల్ల హర్యానా, రాజస్థాన్‌లోని ఛారీ? దాద్రి, భివాని జిల్లాల్లో పర్వతాలు ధ్వంసమై జీవవైవిధ్యం నాశనమైంది. ఒక్క రాజస్థాన్‌లోనే దాదాపు 25 శాతం కొండలు హరించుకుపోయాయని 2018లోనే సుప్రీంకోర్టు నియమించిన కేంద్ర సాధికార సంఘం తేల్చిచెప్పింది. 25 వేలకుపైగా ఎకరాల్లో కొండలు కనుమరుగయ్యాయి. 2011-17 మధ్యలో ఆరావళి శ్రేణుల నుంచి 9.80 లక్షల టన్నుల ఖనిజ వనరులను అక్రమంగా తరలించారనేది కాగ్ నివేదిక. మైనింగ్, రియల్ ఎస్టేట్ అక్రమాలపై నాలుగు వేలకుపైగా కేసులు న్యాయస్థానాల్లో మూలుగున్నాయి. హర్యానాలోని ఫరీదాబాద్ పరిసర ప్రాంతాల్లో ఖనిజ తవ్వకాలను 2002లోనూ, నాలుగు రాష్ట్రాల్లో తవ్వకాలను 2009లోనూ నిషేధిస్తూ సుప్రీంకోర్టు తీర్పులిచ్చినా%ొ% అమలు చేసే ప్రభుత్వాలే లేవు. పర్వతాల స్వరూపం మార్చకూడదన్న సుప్రీంకోర్టు తాజా ఆదేశాలు చుట్టూ మైనింగ్ జరుగుతుంటే ఎలా అమలవుతాయి? ఢిల్లీ నుంచి థార్ వరకూ ఎడారిగా మారుతుందని, భూగర్భ జలాలు అడుగంటతాయని, వాయు కాలుష్యంతో ఢిల్లీసహా ఆయా రాష్ట్రాల నుంచి వలస పోవాల్సిన దుస్థితి ఏర్పడుతుందంటున్న పర్యావరణవేత్తల హెచ్చరికలు పాలకుల చెవికెక్కడం లేదు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జూన్ 5న 'ఆరావళి గ్రీన్‌వాల్ ప్రాజెక్టు'ను ప్రారంభించిన ప్రధాని ఢిల్లీ నుంచి గుజరాత్ వరకూ అడవులు పెంచడమే లక్ష్యమన్నారు. 90 శాతం ప్రాంతంలో మైనింగ్ తవ్వేందుకు వీలుగా నిర్వచనాన్నే మార్చేసి పచ్చదనం ఎక్కడి నుంచి వస్తుందో సమాధానం చెప్పాల్సింది ఏలినవారే. 0.19 శాతమే మైనింగ్‌కు అనుమతిస్తున్నామంటూ పర్యావరణ మంత్రి చెబుతున్నది వాస్తవదూరం. వంద మీటర్లకంటే తక్కువ ఎత్తులోని 90 శాతం ప్రాంతాల రక్షణకు చర్యలు చేపట్టాలి. డిజిటల్ మానిటరింగ్, ఎ.ఐ టూల్స్ తదితర చర్యల ద్వారా అక్రమ మైనింగ్‌ను అడ్డుకోవాలి. కోట్ల ఏళ్లగా పర్యావరణానికి పెట్టని కోటగా ఉన్న ఆరావళిని కాపాడుకోవడం, భవిష్యత్ తరాలకు భద్రంగా అప్పగించడం, 'సేవ్ ఆరావళి'కి మద్దతు పలకడం మనందరి బాధ్యత. మన రాష్ట్రంలోనూ లేటరైట్, బాక్సైట్ తదితర విలువైన ఖనిజాలను తవ్వి కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు అత్యుత్సాహం చూపే పర్యావరణ వినాశక చర్యలకు అడ్డుకట్ట పడాలి.




# రెండో టీ20లో భారత మహిళల జట్టు విజయం



షఫాలీ వర్మ (34 బంతుల్లో 11 ఫోర్లు, సిక్స్‌తో 69 నాటౌట్) అదిరే అర్ధ శతకంతోపాటు స్పిన్నర్లు రాణించడంతో.. భారత మహిళల జట్టు వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. ఏకపక్షంగా సాగిన రెండో టీ20లో భారత్ 7 వికెట్ల తేడాతో శ్రీలంకను చిత్తు చేసింది. దీంతో ఐదు మ్యాచ్‌ల సిరీసలో 2-0 ఆధిక్యంలో నిలిచింది. తొలుత శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 128/9 స్కోరు చేసింది. హర్షిత సమరవిక్రమ (33), చమరి ఆటపట్టు (31), హాసిని పెరీరా (22) ఫర్వాలేదనిపించారు. శ్రీచరణి, వైష్ణవి శర్మ చెరో రెండు వికెట్లు పడగొట్టగా.. స్నేహ్ రాణా (1/11) పొదుపుగా బౌలింగ్ చేసింది. ఛేదనలో భారత్ 11.5 ఓవర్లలో 3 వికెట్లకు 129 పరుగులు చేసి గెలిచింది. జెమీమా రోడ్రిగ్స్ (26) రాణించింది. కవిష, మాల్కి మదార, కవింది తలో వికెట్ పడగొట్టారు. జ్వరంతో బాధపడుతున్న దీప్తి శర్మ స్థానంలో స్నేహ్ రాణా జట్టులోకి వచ్చింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా షఫాలీ నిలిచింది.

డాషింగ్ బ్యాటర్ షఫాలీ తుదికంటా క్రీజులో నిలవడంతో.. స్వల్ప లక్ష్యాన్ని భారత్ అలవోకగా ఛేదించింది. ఓపెనర్లు స్మృతి మంధాన (14), షఫాలీ తొలి వికెట్‌కు 29 పరుగులతో దూకుడైన ఆరంభాన్నిచ్చారు. అయితే, నాలుగో ఓవర్‌లో కవిష బౌలింగ్‌లో భారీ షాట్ ఆడే క్రమంలో మంధాన అవుటైంది. వన్‌డౌన్‌లో వచ్చిన జెమీమా రోడ్రిగ్స్‌తో కలసి షఫాలీ స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది. దీంతో పవర్‌ప్లేను భారత్ 68/1తో ముగించింది. అయితే, 8వ ఓవర్‌లో జెమీమాను కవింది క్యాచవుట్ చేయడంతో.. రెండో వికెట్‌కు 58 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అప్పటికి జట్టు విజయానికి ఇంకా 42 పరుగులు కావాలి. ఈ దశలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (10) అండతో షఫాలీ.. మరో 49 బంతులు మిగిలుండగానే జట్టును గెలిపించింది.

స్నేహ్ రాణాతోపాటు యువ స్పిన్నర్లు చరణి, వైష్ణవి కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో.. లంక ఓ మాదిరి స్కోరుకే పరిమితమైంది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన లంకకు క్రాంతి ఆరంభంలోనే షాకిచ్చింది. ఓపెనర్ విష్మి గుణరత్నె (1)ను రిటర్న్ క్యాచ్‌తో పెవిలియన్ చేర్చింది. అయితే, కెప్టెన్ చమరి, హాసిని రెండో వికెట్‌కు 36 రన్స్‌తో ఆదుకొనే ప్రయత్నం చేశారు. చమరిని రాణా అవుట్ చేయగా.. పెరీరాతో జత కలసి హర్షిత దూకుడుగా ఆడుతూ స్కోరు బోర్డును నడిపించింది. కానీ, హాసినిని అవుట్ చేసిన చరణి.. మూడో వికెట్‌కు 44 పరుగుల భాగస్వామ్యాన్ని విడదీసింది. హర్షితను రిచా రనౌట్ చేయడంతో.. లంక తడబడింది. 24 పరుగుల తేడాతో ఆరు వికెట్లు కోల్పోయింది.

# విజయ్ హజారే ట్రోఫీలో అదరగొట్టిన రోహిత్ శర్మ.. సిక్కింపై ముంబై విజయం




విజయ్ హజారే ట్రోఫీలో భాగంగా జైపూర్ వేదికగా సిక్కింతో జరిగిన మ్యాచ్‌లో ముంబై ఎనిమిది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో ముంబై ఆటగాడు రోహిత్ శర్మ అద్భుత ప్రదర్శన కనబరిచాడు. తొలుత బ్యాటింగ్ చేసిన సిక్కిం నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 236 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ముంబై 30 ఓవర్లలోనే 2 వికెట్లు కోల్పోయి 237 పరుగుల లక్ష్యాన్ని సునాయాసంగా ఛేదించింది.రోహిత్ శర్మ 94 బంతుల్లో 155 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. అతడు తన ఇన్నింగ్స్‌లో 18 ఫోర్లు, 9 సిక్సులు బాదాడు. ముంబై కెప్టెన్ శార్దూల్ పటేల్ రెండు వికెట్లు తీశాడు. రోహిత్‌తో కలిసి అంగ్‌క్రిష్ రఘువంశీ 38 పరుగులు చేసి జట్టు విజయంలో సహకరించాడు. ముషీర్ ఖాన్, సర్ఫరాజ్ ఖాన్ సోదరులు ముంబైని విజయతీరాలకు చేర్చారు.

సిక్కిం బ్యాటర్లలో ఆశిష్ (87 బంతుల్లో 8 ఫోర్లుతో 79 పరుగులు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. కె.సాయి సాత్విక్ (34), క్రాంతి కుమార్ (34), రాబిన్ లింబో (31 నాటౌట్)లు తమవంతు సహకారం అందించారు. రోహిత్ శర్మ ఫీల్డింగ్ చేస్తున్న సమయంలో ప్రేక్షకులు 'ముంబై రాజా' అంటూ నినాదాలు చేశారు. రోహిత్ శర్మను చూసేందుకు అభిమానులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు.




# 'ది రాజా సాబ్' సెన్సార్ కంప్లీట్




పాన్ ఇండియా స్టార్ ప్రభాస నటించిన హారర్ కామెడీ డ్రామా 'ది రాజా సాబ్' చిత్రం తాజాగా సెన్సార్ లాంఛనాలు పూర్తి చేసుకుంది. మారుతి దర్శకత్వం వహించిన ఈ భారీ చిత్రం 2026 జనవరి 9న గ్రాండ్‌గా విడుదల కానుందని ఇప్పటికే నిర్మాతలు ప్రకటించారు. అభిమానుల కోసం జనవరి 8న దేశవ్యాప్తంగా పెయిడ్ ప్రీమియర్లు ఉంటాయని వెల్లడించారు.

తాజా వార్తల ప్రకారం, ఈ సినిమా నిడివి సుమారు 183 నిమిషాలు (3 గంటల 3 నిమిషాలు) ఉంటుందని తెలుస్తోంది. ఈ చిత్రానికి సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) అజూ×ఝు సర్టిఫికెట్ జారీ చేసిందని సమాచారం. ప్రస్తుతం ఈ మూవీ రన్‌టైమ్ గురించిన చర్చ సోషల్ మీడియాలో జోరుగా సాగుతోంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన ఇంకా వెలువడాల్సి ఉంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రానికి తమన్ సంగీతం అందించారు. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ కథానాయికలుగా నటించారు. సంజయ్ దత్ కీలక పాత్రలో కనిపించనున్నారు.

ఈ సినిమా విడుదలకు ముందుగానే ప్రీ రిలీజ్ ఈవెంట్ కూడా ఉంటుందని మూవీ టీమ్ స్పష్టం చేసింది. ఈ ఈవెంట్?కు హైదరాబాద్ వేదికగానే ఓపెన్ గ్రౌండ్స్‌లో ఉంటుందని తెలిపింది. చాలా రోజుల తర్వాత ప్రభాస్‌ను ఈ ఈవెంట్‌లో చూస్తారని ఇటీవలే ఫ్యాన్స్‌కు నిర్మాత విశ్వప్రసాద్ కిక్కిచ్చే న్యూస్ చెప్పారు. దీంతో రెబల్ ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు. అయితే ప్రీ రిలీజ్ ఈవెంట్ డేట్ మాత్రం మేకర్స్ వెల్లడించకపోవడం గమనార్హం.ఇప్పటికీ ఈ మూవీ నుంచి 'సహనా సహనా' అనే మెలోడి పాటను రిలీజ్ చేశారు. ఇందులో ప్రభాస్– నిధి అగర్వాల్ జోడీ ఆకట్టుకుంటోంది. సాంగ్ కూడా కలర్‌ఫుల్‌గా ఉంది. లిరిసిస్ట్ కృష్ణకాంత్ ఆ సాంగ్ రాశారు. సింగర్ విశాల్ మిశ్రా పాడారు. ఎస్.ఎస్.తమన్ సంగీత దర్శకుడు. ఇందులో ప్రభాస్ బ్లూ కలర్ జాకెట్ ధరించి ఉండగా, నిధి అగర్వాల్ ఎల్లో కలర్ ఔట్‌ఫిట్‌లో మెరిసిపోతుంది. ఈ పాట ఫుల్ వెర్షన్ అన్ని ప్లాట్‌ఫామ్స్‌లో అందుబాటులోకి వచ్చిందని ఓ పోస్టర్‌ను పోస్ట్ చేశారు.

రెండు అసభ్య పదాలను వాడినందుకు

# క్షమించండి: శివాజీ



'ఆడ బిడ్డలకు క్షమా పణలు' అని సినీనటుడు శివాజీ అన్నారు. బుధ వారం శివాజీ విలేకరులతో మాట్లాడుతూ 'దండోరా' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో తాను చేసిన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చారు. ఈవెంట్ నుంచి బయటకు రాగానే తాను చేసిన తప్పును గ్రహించినట్లు తెలిపారు. హీరోయిన్ల దుస్తులను ఉద్దేశిస్తూ తాను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. అయితే, ఆ సందర్భంలో రెండు అసభ్య పదాలను వాడినందుకు మాత్రం క్షమాపణ చెబుతున్నానన్నారు. ఆ రోజు వేదికపై ఉన్న తన తోటి నటీనటులు, ఆడ బిడ్డలకు క్షమాపణలు చెప్పారు. అలాంటి పదాలు దొర్లకూడదు అని, 30 ఏళ్ల సినీ జీవితంలో అలా మాట్లాడలేదు అని అన్నారు. రాజకీయాల్లోనూ ఏ రోజూ ఎవరినీ ఒక చిన్న మాట అనలేదని చెప్పారు. హద్దు మీరి మాట్లాడలేదని అన్నారు. ఈవెంట్‌లో ఎందుకు అలా మాట్లాడానా ? అని బాధపడ్డానన్నారు. బయటకు రాగానే, పొరపాటుగా మా ట్లాడినట్లు గ్రహించానన్నారు. అందుకు మనస్ఫూర్తిగా క్షమా పణ చెబుతున్నానన్నారు. అయితే, తాను ఇచ్చిన స్టేట్ మెంట్‌కు మాత్రం కట్టుబడి ఉన్నానన్నారు. ఎవరికీ భయపడే పనే లేదు అని స్పష్టం చేశారు.

ఆ రెండు పదాలు మాత్రం మాట్లా డటం తప్పు అని అన్నారు. తాను నిద్రపోయి 36 గంటలైందని, తనలో అం తర్మథనం మొదలైందని తెలిపారు. రాజకీయా ల్లోనూ తప్పు మాట్లాడని తాను ఇలా ఎలా మాట్లా డానా ? అని ఆలోచిస్తూ ఉండిపోయానన్నారు. అందుకే సినిమా ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనలేదనీ, దాని నుంచి బయటకు వచ్చి తానే ప్రెస్‌మీట్ పెడతానని నిర్మాతకు చెప్పానని తెలిపారు. ఆయన 'ఎందుకులేండీ.. వివాదమవుతుందేమో' అని అన్నారని చెప్పారు. కానీ, సినిమాకు డబ్బులు తీసుకున్నందుకు తన వంతు ప్రమోషన్ చేయాలి కదా ! అని అన్నారు. ప్రేక్షకులు అందరూ కచ్చితంగా థియేటర్‌లో సినిమా చూడాలని కోరారు.






# 26న 'అనగనగా ఒక రాజు' నుండి సెకండ్ సింగిల్ విడుదల



నవీన్ పొలిశెట్టి నటిస్తున్న 'అనగనగా ఒక రాజు' చిత్రం నుండి డిసెంబరు 26న సెకండ్ సింగిల్ రానుంది. 'రాజు గారి పెళ్లి రో' అని సాగే పాటకు సంబంధించిన ప్రోమోకి సంబంధించిన ఫొటోని తాజాగా విడుదల చేశారు. 26న పూర్తి పాట రానుంది. మారి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో మీనాక్షీ చౌదరి హీరోయిన్‌గా నటిస్తున్నారు. మిక్కీ జే మేయర్ మ్యూజిక్ అందిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ చిత్రం వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా థియేటర్స్‌లో విడుదల కాబోతుంది. ఈ క్రమంలోనే.. మ్యూజికల్ జర్నీ స్టార్ట్ చేసిన మేకర్స్ ఇప్పటికే ఇందులోంచి ఫస్ట్ సింగిల్ 'బల్మా'ను రిలీజ్ చేశారు.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem, VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**